


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 234 | ఆదివారం 30 - 08 -2026 | పేజీలు : 12 | వెల-3


**టిబెట్‌లోనూ జలవిలయం.. నిజాలు దాస్తున్న డ్రాగన్**



## ఏకగ్రీవాలపై అధికారంలో ఒక మాట...

# ఇప్పుడొక మాట:

**ఏకగ్రీవాలపై గత ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని సీఎం చంద్రబాబు విమర్శ**



స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాల విషయంలో గత పాలకులు ఇప్పుడు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించి, ఇప్పుడు వాటిని వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అరకు నియోజకవర్గంలోని గన్నెలలో శనివారం జరిగిన 'సంజీవని' ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారం కోల్పోయాక మరో మాట మాట్లాడటం వారి నైజానికి నిదర్శనం" అని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవం అయితే, సదరు నియోజకవర్గ ఇన్చార్జిదే బాధ్యత... వచ్చే ఎన్నికల్లో వారికి టికెట్ ఉండదు అని జగన్ వైసీపీ నేతలను హెచ్చరించిన నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# ఓటర్ల తొలగింపుపై సీఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

- గడువు 4 వారాలు పొడిగించాలని విజ్ఞప్తి
- తెలంగాణలో 92.86 లక్షల ఓట్లు పోయాయన్న రేవంత్ రెడ్డి
- అర్హులైన వారు ఓటు కోల్పోకుండా సమగ్ర పరిశీలన జరపాలని విన్నపం
- ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రతను కల్పించాలన్న సీఎం

:తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల కమిషనర్ కు ముఖ్యమ oత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఏకంగా 92.86 లక్షల ఓట్ల మిగతా 2లో







# గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

- జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు
- సోమశిలలో మరో ప్రపంచస్థాయి కోర్సు
- పీపీపీ విధానంలో అభివృద్ధి
- పర్యాటక ప్రచారానికి కపిల్‌దేవ్ సేవలు వినియోగించుకుంటాం
- పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

తెలంగాణను ప్రపంచస్థాయి గోల్ఫ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. 2లో..



# సీజనల్ వ్యాధులను తేలికగా తీసుకోవద్దు

సీజనల్ వ్యాధులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో సీజన్ వ్యాధుల పరిస్థితిపై ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2లో..

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

**మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ**

**సెప్టెంబర్ 2 వరకు వర్షాల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వెల్లడి**

**లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**



బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే కొద్దిరోజుల్లో వర్షాలు మళ్లీ పుంజుకునే 2లో..





**కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌ను రేవంత్ రెడ్డే కాపాడుతున్నారు**

**హరికృష్ణపై కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ రాడ్లతో దాడి చేశారన్న ప్రవీణ్ కుమార్**

**సుమంత్ పై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం వెనుక రేవంత్ హస్తం ఉందని ఆరోపణ**

# అక్టోబర్ చివరికి రీసర్వే పూర్తి చేయాలి

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి**

**అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశం**





రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో చేపట్టిన భూముల రీసర్వేను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లో రెండో విడత రీసర్వే చేపట్టేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో 2లో..

# 22ఏ భూముల సమస్యలపై పోరుబాట



- మరో రెండు పోరాటాలకు రెడీ అవుతున్న తెలంగాణ బీజేపీ
- సెప్టెంబర్ 5, 6 తేదీల్లో 22ఏ భూముల వ్యవహారంపై దీక్ష
- ఆదిలాబాద్నుంచి అసెంబ్లీ వరకు రైతు యాత్ర

2

# హైదరాబాద్‌లో గంజాయి చాక్లెట్ల కలకలం



నగరంలోని శామీర్‌పే ట్‌లో భారీగా గంజాయి చాక్లెట్లు పట్టుపడటం కలకలం రేపింది. యువత, చిన్నారులే లక్ష్యంగా గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి భారీఎత్తు న గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన బైద్‌నాథ్, అతడి భార్య పూజారి కొంతకా లంగా శామీర్‌పేట్‌లో నివసిస్తున్నారు. 2లో..



# వేపచెట్టు రేపిన చిచ్చు..

## ఇద్దరి దారుణ హత్య

**సూర్యాపేట జిల్లా ఎర్రగడ్డ తండాలో విషాదం**

**గొడ్డళ్లతో దాడులు చేసుకున్న రెండు వర్గాలు**

సూర్యాపేట జిల్లాలో ఓ చిన్న వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయమై రెండు వర్గాల మధ్య రేగిన చిచ్చు... దారుణమైన రక్తపాతానికి దారితీసింది. మాటామాటా పెరిగి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన 2లో..

## తెలంగాణలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో

# టీచర్లకు ప్రత్యేక టెట్

**ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్ షెడ్యూల్ విడుదల**

**సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ఆన్‌లైన్ పరీక్షలు**

**మొత్తం 24,983 మంది అభ్యర్థులు హాజరు**

తెలంగాణలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. 2

# ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్‌పై వేటు



**మజ్లిస్ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరణ**

**అర్ధరాత్రి చర్యల వెనుక కారణాలు చెప్పాలన్న రాజాసింగ్**

**అసదుద్దీన్ ఓవైసీ మీడియా ముందు వివరణ ఇవ్వాలని డిమాండ్**

2

# ఓటర్ల తొలగింపుపై సీఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఏకంగా 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన నోటీసులు, పరిశీలనలు వెలువడటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన పౌరులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా చూసేందుకు సమగ్ర పరిశీలన అత్యవసరమని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం నిర్ణయించిన గడువులోగా నోటీసులకు స్పందించడం, అభ్యంతరాలు నమోదు చేయడం, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించడం సాధారణ పౌరులకు సవాలుగా మారిందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా ఉపాధి కోసం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస కూలీలు, రోజువారీ కూలీలు తమ ఓటు హక్కును నిరూపించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించే సమయాన్ని మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని లేఖలో స్పష్టంగా కోరారు. దీంతో పాటు, అత్యధికంగా ఓటర్ల సంఖ్య ఉన్న హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో పరిశీలన ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా సాగేందుకు అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను తక్షణమే నియమించాలని సూచించారు. గ్రామసభలు, పురపాలక వార్డుల్లో ఓటర్ల జాబితాను బిగ్గరగా చదివి వినిపించాలని, పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను వికేంద్రీకరించడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

ధర్మఘంట ఆగస్టు29 హైదరాబాద్: తెలంగాణను ప్రపంచస్థాయి గోల్ఫ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందులో భాగంగా షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు.

### సోమశిలలో మరో ప్రపంచస్థాయి కోర్సు

కృష్ణానది తీరంలో, నల్లమల అడవులు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పర్యాటక క్లస్టర్ సోమశిలలో మరో ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సోమశిలను ప్రత్యేక గోల్ఫ్ టూరిజం గమ్యస్థానంగా అభివృద్ధి చేయడంతో తెలంగాణను గోల్ఫ్ టూరిజం హబ్‌గా మరింత బలోపేతం చేయవచ్చన్నారు. గోల్ఫ్ టూరిజం మౌలిక వసతుల అభివృద్ధిలో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని అనుసరించనున్నట్లు తెలిపారు. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్ సందర్భంగా శనివారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. డీపీ వరల్డ్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (డీపీ వరల్డ్ పీజీటీఐ), హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి ఈవెంట్ పార్ట్‌నర్‌గా తెలంగాణ టూరిజం వ్యవహరిస్తోంది. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ కేవలం క్రీడా పోటీ మాత్రమే కాదని.. అంతర్జాతీయ గోల్ఫ్‌ను తెలంగాణ పర్యాటక, వారసత్వ సంపదతో అనుసంధానించే వేదిక అని జూపల్లి అన్నారు. గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్సులో ఈ టోర్నీ నిర్వహించడం రాష్ట్ర చరిత్ర, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం దక్కిందన్నారు. హైదరాబాద్ నగరానికే తెలంగాణ పర్యాటకం పరిమితం కాదని.. రాష్ట్రంలోని సరస్సులు, అడవులు, గోదావరి, కృష్ణా నదులు, రాజభవనాలు, కోటలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని చెప్పారు.

### కపిల్‌దేవ్ సేవలు వినియోగించుకుంటాం

తెలంగాణలో పర్యాటకం, క్రీడల ప్రచారం కోసం కపిల్‌దేవ్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని జూపల్లి తెలిపారు. ఆయన అనుభవం, అంతర్జాతీయ గుర్తింపును రాష్ట్ర పర్యాటక, క్రీడా రంగాల ప్రచారానికి ఉపయోగించుకుంటామని చెప్పారు. టోర్నీ నిర్వహణకు సహకరిస్తున్న డీపీ వరల్డ్ పీజీటీఐ, హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్, ఇతర భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణను ప్రపంచస్థాయి గోల్ఫ్ టూరిజం గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు ప్రపంచస్థాయి సౌకర్యాల కల్పన కొనసాగిస్తామని చెప్పారు.

### తెలంగాణ టూరిజం సహకారం అభినందనీయం

డీపీ వరల్డ్ పీజీటీఐ అధ్యక్షుడు కపిల్‌దేవ్ తెలంగాణ టూరిజం అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. ఈ టోర్నీ ద్వారా తెలంగాణ, హైదరాబాద్‌ను ప్రముఖ గోల్ఫ్ టూరిజం గమ్యస్థానాలుగా ప్రచారం చేయవచ్చన్నారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అందిస్తున్న వేదికకు కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రపంచానికి హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ పరిచయం

హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ కెప్టెన్ జస్విందర్ సింగ్ బిర్గి మాట్లాడుతూ.. 12వ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌కు ఆతిథ్యమివ్వడం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ గోల్ఫర్ల ఆటను హెచ్‌జీఏ సభ్యులు వీక్షించే అవకాశం లభిస్తుందని తెలిపారు. లైవ్ టెలికాస్ట్ ద్వారా హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం అవుతుందన్నారు.

### 132 మంది గోల్ఫర్లు.. రూ.కోటి ప్రైజ్‌మనీ

సెప్టెంబరు 1 నుంచి 4 వరకు జరిగే టోర్నీలో 132 మంది గోల్ఫ్ క్రీడాకారులు పాల్గొననున్నారు. రూ.కోటి ప్రైజ్‌మనీ కోసం పోటీపడనున్నారు. భారత్‌తో పాటు విదేశాలకు చెందిన ప్రముఖ గోల్ఫర్లు పాల్గొంటున్నారు. టోర్నీకి అధికారిక ప్రపంచ గోల్ఫ్ ర్యాంకింగ్ పాయింట్లు లభించనున్నాయి. కార్యక్రమంలో డీపీ వరల్డ్ పీజీటీఐ సీఈఓ అమన్‌దీప్ జోల్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన అంతర్జాతీయ గోల్ఫర్ స్టెపాన్ డానెక్ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ చివరికి రీసర్వే పూర్తి చేయాలి

డిసెంబర్‌లో రెండో విడత రీసర్వే చేపట్టేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఉమ్మడి నల్గొండ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. దశాబ్దాలుగా గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలకు మేలు జరిగేలా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. మొదటి విడతలో రీసర్వే చేపట్టిన 70 గ్రామాల్లో సర్వేను పారదర్శకంగా నిర్వహించి గ్రామ సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని మంత్రి ఆదేశించారు. ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని నిర్ణయించిన గడువు కంటే ముందుగానే సర్వే పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో సర్వేను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని, సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని చెప్పారు. సర్వే నిర్వహించిన రోజే భూ రికార్డులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. రీసర్వే పూర్తయితే రెవెన్యూ రికార్డుల సమగ్ర ప్రక్షాళన జరిగి 90 శాతానికి పైగా భూ సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన సమస్యలను చట్టానికి లోబడి శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. రీసర్వేకు అవసరమైన చోట పక్క మండలాల నుంచి సర్వేయర్లను సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. విధులకు హాజరుకాని లైసెన్స్‌డ్ సర్వేయర్లపై అవసరమైన చర్యలు తీసుకుని, లైసెన్స్ రద్దు చేసే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సమీక్షిస్తూ తొలి విడతలో మంజూరైన ఇళ్లకు సంబంధించిన ఎల్-1, ఎల్-2, ఎల్-3 సమస్యలను పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా 15 రోజుల్లో ఎల్-3 సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రెండో విడత ఇళ్ల మంజూరు సమయంలోనే ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంజూరు ఉత్తర్వుల ఆధారంగా ఒక బిల్లు వచ్చిన తరువాత తదుపరి బిల్లులు నిలిచిపోయిన సందర్భాలను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పేదలకు అన్ని పన్నులు, రవాణా చార్జీలు కలుపుకొని రూ.230కే సిమెంట్ బస్తా అందించేలా సిమెంట్ కంపెనీలతో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను గుర్తించి 15 రోజుల్లో పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తొలి విడతలో అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను దసరాలోపు పూర్తి చేయాలని సూచించారు. నల్గొండ పట్టణంలో ఇందిరమ్మ టవర్స్ కింద 500 ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించాలని, ప్రజలను అనవసరంగా ఇబ్బందులకు గురిచేయొద్దని మంత్రి సూచించారు. భూ సమస్యల దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడంపై అధికారులను అప్రమత్తం చేశారు. సమావేశంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ భూ భారతి, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. తొలి విడతలో మిగిలిపోయిన ఇందిరమ్మ ఇళ్లు, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను దసరాలోపు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని కోరారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భూ భారతి ద్వారా పేదల నిజమైన భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి తదితరులు తమ నియోజకవర్గాల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో రెవెన్యూ సీసీఎల్ఏ కార్యదర్శి లోకేష్‌కుమార్, ల్యాండ్ సర్వే సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ఎండీ గౌతమ్ శాఖల వారీగా వివరాలు వెల్లడించారు. నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తమ జిల్లాల్లో చేపట్టిన చర్యలను వివరించారు. సమీక్ష సమావేశానికి ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, సబ్ రిజిస్ట్రార్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీలు, తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

## వేపచెట్టు రేపిన చిచ్చు..

సూర్యాపేట జిల్లాలో ఓ చిన్న వివాదం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయమై రెండు వర్గాల మధ్య రేగిన చిచ్చు... దారుణమైన రక్తపాతానికి దారితీసింది. మాటామాటా పెరిగి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇరు వర్గాలు విచక్షణ కోల్పోయి ఏకంగా గొడ్డళ్లతో పరస్పరం దాడులకు తెగబడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో గొడ్డలి వేట్లకు గురైన ఇద్దరు వ్యక్తులు రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఈ ఘర్షణను అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌కుమార్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఓ చిన్న చెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలు తీయడంతో పాటు పోలీసులకే గాయాలయ్యే స్థాయికి వెళ్లడంతో... ఎర్రగడ్డతండాలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## తెలంగాణలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో టీచర్లకు ప్రత్యేక టెట్

తెలంగాణలో ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. 2026 విద్యా సంవత్సరానికిగాను సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ఈ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక టెట్ కోసం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24,983 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షలను ప్రతిరోజూ మూడు షిఫ్టుల్లో నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం 9:00 గంటల నుంచి 11:30 వరకు, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి 4:30 వరకు వివిధ సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. సెప్టెంబర్ 8న పేపర్-1, పేపర్-2 (తెలుగు, ఇంగ్లీష్ మీడియం) పరీక్షలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 9వ తేదీన మిగిలిన మాధ్యమాలకు సంబంధించిన పేపర్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్‌పై వేటు..

ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరించడంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని డిమాండ్ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు మజ్లిస్ పార్టీ ప్రకటించింది. దీనితో పాటు, ఆయన తక్షణమే తన శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేయాలని ఆదేశించింది. ఆయనపై ఉన్న కొన్ని వివాదాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు సంకేతాలిచ్చినప్పటికీ, బహిష్కరణకు గల నిర్దిష్ట కారణాలను మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో రాజాసింగ్ మాట్లాడుతూ, ఈ బహిష్కరణ పాతబస్తీ ప్రజల్లో అనేక సందేహాలను రేకెత్తించిందని అన్నారు. అర్ధరాత్రి వేళ అత్యవసరంగా ఇటువంటి చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితులు ఎందుకు తలెత్తాయో పార్టీ నాయకత్వం వివరించాలని ఆయన ప్రశ్నించారు. అసదుద్దీన్ ఓవైసీ జాతీయ మీడియా ముందుకు వచ్చి, ఈ ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు.

## సీజనల్ వ్యాధులను తేలికగా తీసుకోవద్దు

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. గతేడాదితో పోలిస్తే డయేరియా, డిసెంట్రీ కేసులు కూడా తక్కువగా నమోదు అయినట్లు తెలిపారు. టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగాయన్నారు. కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఫీవర్ సర్వేలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి జ్వరం కేసును పర్యవేక్షించి.. అవసరమైన పరీక్షలు, చికిత్స అందించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మందులు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఐఎల్ఐ, స్వైన్‌ఫ్లూ కేసులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐఎల్ఐ కేసులపై రోజువారీగా పర్యవేక్షించాలని రాజనర్సింహ తెలిపారు. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా పూర్తిగా నియంత్రణలోనే ఉందని మంత్రికి అధికారులు వివరించారు. దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నిల్వ నీటి తొలగింపు, లార్వా నిర్మూలన, ఫాగింగ్ కొనసాగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స కంటే.. ముందస్తు నివారణే లక్ష్యమన్నారు. ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల కేసులను ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు.

## కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌ను రేవంత్ రెడ్డే కాపాడుతున్నారు

మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌ను అరెస్ట్ కాకుండా స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాపాడుతున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ మేరకు ఆరోపించారు. జూలై 30వ తేదీన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్, చెక్‌పోస్ట్ సమీపంలోని ఒక డెన్‌లో కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ తన అనుచరులతో కలిసి బాధితుడు హరికృష్ణపై రాడ్లతో దారుణంగా దాడి చేశారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. జూలై 31న బాధితుడు ఫిర్యాదు చేస్తే, దాదాపు 20 రోజుల పాటు కేసు నమోదు కాకుండా అడ్డుకుని ఆగస్టు 20న మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తం ఉందన్నారు. జూబ్లీహిల్స్‌లో దాడి జరిగితే సైబరాబాద్ పరిధిలోని మేడిపల్లిలో కేసు నమోదు కావడం సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తోందని వ్యాఖ్యానించారు. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత వివాదాస్పద వ్యాఖ్యలు చేసేంత వరకు సుమంత్‌పై కేసు నమోదు కాకుండా తొక్కిపెట్టారని, కేసు నమోదైనా ఇప్పటి వరకు సుమంత్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేదని నిలదీశారు. పైగా కేవలం మూడు వారాల క్రితమే బాధ్యతలు స్వీకరించిన జూబ్లీహిల్స్ సీఐ ముత్తు యాదవ్‌ను ఈ వ్యవహారంలో బలిపశువును చేస్తూ అకారణంగా సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే కొద్దిరోజుల్లో వర్షాలు మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో వేగంగా మారుతున్న ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల వాసులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ వర్షాల తీవ్రత సెప్టెంబర్ 2 వరకు కొనసాగే అవకాశం ఉందని, ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఇక తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, రాజధాని హైదరాబాద్‌లో రానున్న 24 గంటల్లో ఆకాశం దట్టంగా మేఘావృతమై అప్పుడప్పుడు వాన చినుకులు పడే అవకాశం ఉందన్నారు.

## 22ఏ భూముల సమస్యలపై పోరుబాట

తెలంగాణలో ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ పార్టీని బలోపేతం చేసుకునే దిశగా బీజేపీ ముందుకు సాగుతోంది. ఇటీవల విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ విజయవంతంగా దీక్ష నిర్వహించిన బీజేపీ నాయకత్వం... తాజాగా రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా మరో రెండు ప్రధాన పోరాటాలకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో నిషేధిత 22ఏ జాబితాలో చేర్చిన భూముల వ్యవహారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల (సెప్టెంబర్) 5, 6 తేదీల్లో బీజేపీ నేతలు భారీ దీక్ష చేపడుతున్నారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై చర్చించేందుకు ఈరోజు నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. మరోవైపు, ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ లోని అసెంబ్లీ వరకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ 'రైతు యాత్ర' చేపడుతున్నారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేయనున్నట్లు బీజేపీ ప్రకటించింది.

## హైదరాబాద్‌లో గంజాయి చాక్లెట్ల కలకలం..

వారు ఓ పాన్‌షాప్ పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నారు. అయితే, అక్రమ మార్గంలో డబ్బు సంపాదించడానికి అలవాటుపడిన వారు.. గంజాయిని చాక్లెట్ల రూపంలో అమ్ముతున్నారు. పాన్‌షాప్ ముసుగులో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు.. సదరు షాప్‌పై దాడి చేశారు. బైద్‌నాథ్‌ను అరెస్ట్ చేసి 25 కేజీల బరువున్న 5,298 గంజాయి చాక్లెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న అతడి భార్య కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. ఈ సంఘటనతో అప్రమత్తమైన పోలీసులు పాఠశాలలు, కాలేజీల వద్ద నిఘా పెంచారు. తల్లిదండ్రులు తమ పిల్లలు కొనుగోలు చేసే ఆహార పదార్థాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు.

# ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన.





**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 29 (నంది పత్రిక):** మండలం లోనిపెద్ద కంబలూరు గ్రామంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా ఉద్యానవన అధికారి యు. నాగరాజు, 3 ఎఫ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ విజయ ప్రసాద్, మహానంది పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డా. ఎం.కె. నాయక్, 3 ఎఫ్ జోనల్ హెడ్ ఫిరోజ్, ఉద్యానవన అధికారి డి. దస్తగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి యు. నాగరాజు మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల కారణంగా అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతం లోపం ఏర్పడే అవకాశం ఉన్నందున ఆయిల్‌పామ్ తోటల్లో నీటి యాజమాన్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు. డ్రిప్ సేద్యం ద్వారా నీటిని పొదుపుగా వినియోగిస్తూ, మొక్కలకు అవసరమైన సమయంలో తగినంత నీటిని అందించాలని తెలిపారు. మహానంది పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డా. ఎం.కె. నాయక్ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల సమయంలో ఆయిల్‌పామ్ మొక్కలకు తేమ ఒత్తిడి రాకుండా చర్యలు చేపట్టాలని, నేలలో తేమను నిలుపుకునేందుకు మల్చింగ్, సేంద్రీయ పదార్థాల వినియోగం, కలుపు నివారణ వంటి పద్ధతులను పాటించాలని వివరించారు. మొక్కల వయస్సు, నేల పరిస్థితులకు అనుగుణంగా నీరు, ఎరువుల యాజమాన్యం చేపట్టాలని సూచించారు. 3 ఎఫ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ తోటల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సూచనలు, రైతులకు సంస్థ అందించే సహకారం గురించి వివరించారు. 3 ఎఫ్ జోనల్ హెడ్ ఫిరోజ్ రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ అధిక ఉష్ణోగ్రతలు, తేమ లోపం సమయంలో తోటలలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఉద్యానవన అధికారి డి. దస్తగిరి మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో నీటి యాజమాన్యం చేపట్టాలని, శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా ఆయిల్‌పామ్ తోటలను ఆరోగ్యంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో రుద్రవరం మండలంలో ఆయిల్ పామ్ చేసిన రైతులు, ఉద్యానవన శాఖ సిబ్బంది, 3 ఎఫ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో మాతృ భాషా దినోత్సవం.



**బేతంచెర్ల ఆగస్టు 29 (నందిపత్రిక ).** బేతంచెర్ల మండలం గొరుమానుకొండ గ్రామ పరిధిలోగల ఏపీ.మోడల్ స్కూల్ నందు మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని,అష్టావధాన కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ మరియదాసు అధ్యక్షతన డాక్టర్. వైష్ణవ వెంకట రమణమూర్తి సంచాలకత్వశీలో అవధాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ నా శిష్యుడు గంగుల నాగరాజు,నా దగ్గర పద్య విద్య నేర్చుకొని గొప్ప అవధానిగారాటుతేలాడు. త్వరలోనే శతావధానం చేయాలని కోరుకున్నారు. అష్టావధానిగా డాక్టర్ గంగుల నాగరాజు ప్రార్థనతో అవధానం ప్రారంభం చేశారు. 8అంశాలలో భాగంగా అనునాసికాలు లేకుండా నిషిద్ధాక్షరి, రసవంతమైన సమస్య, పెరుగు, కారము,చారు, సాంబారు పదాలతో కరువు పోయి వర్షాలు పడాలన్న దత్తపది,వర్ణనలో భాగంగా తమిళనాడు సిఎం. విజయ్ విజయం మీద సాగింది. అమెరికా యుద్ధ భీతి ఆశువుగా,తెలుగు బోధన తియ్యదనం పై చెప్పారు. చమత్కారయుక్తమైన, సరసమైన ప్రశ్నలతో అప్రస్తుత ప్రసంగము జరిగింది. నీ మాటకు నాపాట తో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి పథకంపై పాట పాడారు. అలాగే నవ సమాజ నిర్మాణం కోసం గురువులు, గురుకులం ప్రాముఖ్యత గురించి సభను అలరిస్తూ పాట పాడారు. పురాణ పట్టణంలో భాగంగా బమ్మెర పోతనా మాత్యుని పద్యాలను అలపించారు. సభా కార్యక్రమంలో విద్యార్థులను చక్కగా అలరించారు. కార్య క్రమానికి విచ్చేసిన తెలుగు పండితులను ఘనంగా సన్మానించారు. అష్టావధాని మాట్లాడుతూ తెలుగులో క్లిష్టమైనటు వంటి ప్రక్రియల్లో అవధానం అద్భుత మైనదని మేధస్సుకు ఏకాగ్రతకు పెట్టింది పేరని, పనిచేసే పాఠశాలలో అష్టావధానం చేయడమనేది గొప్ప అనుభూతి అని ఆనందం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ మరియదాసు మాట్లాడుతూ అవధానం రసభరితంగా జరిగిందని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.

## కళాశాల విద్యార్థికి బ్యాటరీ సైకిల్ మంజూరు సాధ్యం కాదట



**బండి ఆత్మకూరు నంది పత్రిక ఆగస్టు 29:** చదువు కోసం కళాశాలకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్న ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థి గణేష్ కు మూడు చక్రాల బ్యాటరీ సైకిల్ ఇవ్వడం సాధ్యం కాదని అధికారులు తేల్చేశారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న లింగాపురం గ్రామానికి చెందిన గణేష్ బాల్యం నుండి శారీరక ఎదుగుదల లేకపోవడంతో అష్ట కష్టాలు పడ్డాడు. ఎలాగోలా పదవ తరగతి పాసై, బండి ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ లో చేరాడు. అయితే లింగాపురం గ్రామం నుండి కళాశాలకు వచ్చేందుకు గణేష్ ఇబ్బందులు పడుతూ ఉన్నాడు. ఇం దుకు శరీరం సహకరించకపోవడంతో, తోటి విద్యార్థులే గణేష్ ను కళాశాలకు తీసుకొని వస్తున్నారు. ఈనెల 8వ తేదీన పార్నపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తనకు మూడు చక్రాల సైకిల్ ను మంజూరు చేయించాలని దరఖాస్తు చేసుకున్నాడు. ఈ దరఖాస్తును విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కర్నూలుకు అధికారులు సిఫారసు చేశారు. గణేష్ ఫిర్యాదును పరిశీలించిన అధికారులు మూడు చక్రాల బ్యాటిల్ సైకిల్ కొరకు ఆ లింకు వారు నిర్వహించే క్యాంపుకు దరఖాస్తుదారుడు హాజరుకావాలని పేర్కొన్నారు. క్యాంపులో డాక్టర్లు పరీక్షించి తగిన సహాయ పరికరం కొరకు ఎంపిక చేస్తారు కాబట్టి, ఆ లింకో క్యాంపు నిర్వహించే ముందు పత్రికా ప్రకటన ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అదనంతరం క్యాంపుకు హాజరైతే నియమ నిబంధనల మేరకు మూడు చక్రాల బ్యాటరీ సైకిల్ మంజూరు చేస్తామని గణేష్ కు సమాచారం అందించారు. అయితే ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు వయసు 18 నుండి 45 సంవత్సరాల వయసు ఉన్న వారికి బ్యాటరీ సైకిల్ మంజూరు చేస్తామని, గణేష్ కు ప్రస్తుతం వయస్సు 16 సంవత్సరాలు ఉన్నందున మూడు చక్రాల సైకిల్ మంజూరు చేయుటకు వీలుపడదని చెప్పారు. సైకిల్ వస్తుందన్న ఆశపడిన గణేష్ కు నిరాశే మిగిలింది. మూడు చక్రాల బ్యాటరీ సైకిల్ మంజూరుకు గణేష్ మరో రెండేళ్లపాటు ఆగాల్సిందే!

## సమాజంలో మంచి పనులు చేస్తే గుర్తింపు తప్పకుండా వస్తుంది : రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి

**నంది పత్రిక ఆత్మకూరు..** నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ జనరల్ బాడీ మీటింగ్ సందర్భంగా శనివారం నంద్యాల జిల్లాలోని రెడ్ క్రాస్ కార్యాలయంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి అధ్యక్షతన జిల్లాలో, సమాజ సేవలో ఆక్టివ్ గా ఉన్నవారిని గుర్తించి వారిని రెడ్ క్రాస్ సంస్థ ద్వారా నంద్యాల జిల్లా కలెక్టర్ .రాజా కుమారి గనియా మరియు జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ సునీల్ షారోన్ ద్వారా ప్రశంస పత్రాలు ఇచ్చే కార్యక్రమం ఏర్పాటు చేసారు. ప్రశంస పత్రాలు పొందిన వారిలో కురుకుందకు చెందిన రెడ్ క్రాస్ మండల చైర్మన్ వెంకటేశ్వర్లు,ఆత్మకూరు రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ మక్బూల్ భాష,రెడ్ క్రాస్ లో ఆక్టివ్ గా సభ్యత్వాలు చేపట్టిన పట్టణానికి చెందిన చిన్న శివా కు కలెక్టర్ ప్రశంస పత్రాలు అందజేశారు. అలాగే శ్రీశైలం శాసనసభ్యులు .బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ వారు చేస్తున్న మెడికల్ క్యాశీపులు,రక్తదాన శిబిరాలు మరియు క్రీడల సేవలను గుర్తిస్తూ నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ వారు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా ను నంద్యాలకు ఆహ్వానించి రెడ్ క్రాస్ కార్యాలయంలో వారి సమావేశ అనంతరం గౌరవ నంద్యాల జిల్లా కలెక్టర్ .రాజ కుమారి గనియా చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా పస్పిల్ మున్నా మాట్లాడుతూ ప్రతిఒక్కరు సమాజా సేవలో ముందుండాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ వారు చేస్తున్న కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



## ఆరడుగుల నేలకై ఆందోళన

### స్మశాన వాటిక సమస్య తీర్చాలంటూ బైఠాయించిన ఎస్సీలు.

### వి ఆర్ ఓ, విలేజ్ సర్వేయర్ లపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేసిన ఎస్సీలు.



**శిరివెళ్ల : (నంది పత్రిక)** స్వతంత్ర భారతావనిలో మనిషి మృతి చెందితే శవాలను పూడ్చుకునేందుకు ఆరడుగుల నేల కరువ య్యిందనీ తీవ్ర ఆందోళనకు దిగారు. శిరివెళ్ల తహసిల్దార్ కార్యాలయం ఎదుట సుమారు 200 మంది ఎస్సీలు బైఠాయించి స్మశాన వాటిక స్థలం సమస్య పరిష్కరించాలంటూ నిర్లక్ష్యం వహిస్తూ కాలయాపన చేస్తున్న వి.ఆర్.ఓ విలేజ్ సర్వేయర్ లపై తక్షణమే కఠిన చర్యలు తీసుకొని కులం పేరుతో దూషించిన వారిని వెంటనే అరెస్టు చేసేలా ఆదేశించాలని వారు ఆర్జిలో కొరారు. శిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామానికి చెందిన మాదిగ కాలనీలో శుక్రవారం ప్రసాదు అను వ్యక్తి మృతి చెందగా స్మశాన వాటికలో భూస్థాపితం చేసేందుకు శవాన్ని మోసుకొని వెళుతుండగా గుండంపాడు గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అడ్డుకున్నారని కులం పేరుతో దూషించి అవమానకరంగా ప్రవర్తించారని శిరివెళ్ల తహసిల్దార్ మరియు శిరివెళ్ల ఎస్ఐ వారికి లిఖితపూర్వకంగా వినతి పత్రం అందజేశారు. గత కొన్ని నెలల నుండి స్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుండంపాడు గ్రామం ఏర్పడినప్పటి నుండి నేటి వరకు 150 మాదిగ కుటుంబాల వారికి ఉన్నటువంటి స్మశాన వాటికను కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అధికారులు తక్షణమే స్పందించి స్మశాన వాటిక యొక్క నాలుగు హద్దులు చూపించి న్యాయం చేయాలని కోరారు. ఆటోలు ట్రాక్టర్లు వేసుకొని సుమారు 200 మందికి పైగా మహిళలు యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యను తక్షణమే పరిష్కరించే అధికారులే లేరా అని ప్రశ్నించారు. తమ గ్రామానికి చెందిన వీఆర్వో మరియు విలేజి సర్వేర్లు స్మశాన వాటిక కబ్జా చేసేవారికి కొమ్ముకాస్తూ వత్తాసు పలుకుతూ తమకు అన్యాయం చేస్తున్నారని విలేజ్ సర్వేయర్ విలేజి రెవెన్యూ అధికారి జతీశ్ లు తమ స్మశాన వాటికను సర్వే చేసి హద్దులు చూపించడంలో పూర్తిగా విఫలం అయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శిరివెళ్ల తహసిల్దార్ గారికి పలుమార్లు అర్జీలు ఇచ్చినప్పటికీ బుట్ట దాఖలు చేశారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్మశాన వాటిక స్థలాన్ని కబ్జాకు గురికాకుండా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

# దేశ భాషలందు తెలుగు లెస్స

### కురుకుంద జడ్పీ హైస్కూల్ లో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం.

**నంది పత్రిక ఆత్మకూరు..** దేశభాషలందు తెలుగు లెస్స అని కురుకుంద ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు జగదీశ్వరి అన్నారు. శనివారం నాడు ఆత్మకూరు మండలంలోని, కురుకుంద ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్చార్జి హెచ్‌ఎం జగదీశ్వరి మాట్లాడుతూ తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు చరిత్రకారుడు సంఘసంస్కర్త హేతువాది ఉపాధ్యాయుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు 163 వ జన్మదినోత్సవాన్ని మరియు జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరుపుకోవడం జరిగింది. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి నిత్య వ్యవహారములోని భాషలో ఉన్న అందాన్ని విలువను తెలియజేప్పిన మహనీయుడని, ఆంధ్రదేశంలో వ్యవహారిక భాష ఉద్యమానికి మూల పురుషుడు బహు భాషా కోవిదుడు సంఘసంస్కర్త హేతువాది శిష్ట జన వ్యవహారిక భాషను గ్రంథ రచనకు స్వీకరింప చేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు అని అన్నారు. గిడుగు ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యవహారిక భాషలో సాగి అందరికీ అందుబాటులోనికి వచ్చిందని ఆమె అన్నారు. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మక శక్తి ప్రతి ఒక్కరికి వీలైందని, గిడుగు రామమూర్తి పంతులు జన్మ దినోత్సవం ఆగస్టు-29 తెలుగు భాషా దినోత్సవంగా ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నామనీ అన్నారు. తెలుగు భాష తేనే కన్నా తీయనిది, వెన్నకన్నా కమ్మనిది, చందమామ కన్నా చల్లనిది అని, తెలుగు నేర్చుకుందాం మన భవిత మార్చుకుందాం, మాతృభాష నేర్చుకో అనుబంధం పెంచుకో, తెలుగు జాతి మనది తెలుగు భాష మనది, తెలుగు నేలపైన తెలుగు వికసించాలి, మాతృభాష తెలుగు మన బ్రతుకంతా వెలుగు, నేర్చుకుందాం నేర్చుకుందాం తెలుగు భాషను నేర్చుకుందాం అని ఆమె అన్నారు. పి.డి-మురళి నాయక్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలకు కూడా కొంత సమయాన్ని కేటాయించాలని ఆయన విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం వ్యాసరచన, పద్య పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జవహర్ నాయక్, మురలీ నాయక్, రవి, రవి ప్రకాష్, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.



## వెలుగోడులో 'డోర్ టు డోర్' కార్యక్రమం.

### ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన.



**వెలుగోడు, 29 (నంది పత్రిక):** శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాల మేరకు, తెలుగుదేశం పార్టీ పిలుపుతో వెలుగోడు పట్టణంలో శనివారం 'డోర్ టు డోర్' ప్రజా సమస్యల సేకరణ కార్యక్రమం జరిగింది. స్థానిక గంగాబాయి వీధిలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఖలీల్ ఖాన్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వం గడిచిన రెండేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా ఆయా కుటుంబాలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను నమోదు చేసుకున్నారు, వాటిని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించేందుకు నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండ్ల శంకర్ రెడ్డి , బూత్ కన్వీనర్ గిరిబాబు, టిడిపి నాయకులు రాము తో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం

### లయన్స్ క్లబ్ తెలుగు భాషా దినోత్సవ పురస్కారాల ప్రదానం పురస్కారాలు అందుకున్న సాహితీవేత్త రమణమూర్తి,శారదా విద్యాపీఠం తెలుగు భాష ఉపాధ్యాయులు వెంకటకృష్ణ

**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 29 . (నంది పత్రిక ):** శనివారం తెలుగు వ్యావహారిక పితా మహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ లయన్స్ క్లబ్ నాయకులు సూరన సారస్వత సంఘం అధ్యక్షులు డాక్టర్ గెలివి సహదేవుడు సౌజన్యంతో స్థానిక శారదా విద్యాపీఠం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి మేడా చంద్రశేఖర్, రీజనల్ చైర్మన్ నిజాముద్దీన్, జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా తెలుగు వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత, సాహితీ వేత్త, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత రమణ మూర్తి,శారదా విద్యాపీఠం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తెలుగు భాష ఉపాధ్యాయులు వెంకటకృష్ణ లకు లయన్స్ క్లబ్ తెలుగు భాషా దినోత్సవ పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కిరణ్ లాల్, వాసు కుట్టి, పాఠశాల కమిటీ సభ్యురాలు వసుంధర,అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



నంది పత్రిక
ఆదివారం 30 - 08 -2026

# చేతి వృత్తిదారుల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తీసుకురావాలి.

## చేతి వృత్తిదారుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు బి మాధవస్వామి



**కర్నూల్ సిటీ నంది పత్రిక** వృత్తిదారుల సమస్యలను పరిష్కరించి ఉపాధి, ఆర్థిక భద్రత కల్పించాలి అని ఆర్డిఓ నారాయణమ్మ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా బి మాధవ స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో తరతరాలుగా చేతివృత్తులను నమ్ముకుని జీవిస్తున్న వృత్తిదారులు నేడు అనేక ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆధునిక యంత్రాల పోటీ, ముడిసరుకుల ధరల పెరుగుదల, మార్కెట్ సదుపాయాల కొరత, రుణభారం తదితర కారణాలతో చేతివృత్తులు సంక్షోభంలో ఉన్నాయి. ప్రభుత్వం చేతివృత్తిదారుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపించి, శాశ్వత పరిష్కారాలు కల్పించాలని కోరుతున్నాం. చేతివృత్తిదారుల ఆర్థికాభివృద్ధి, ఉపాధి భద్రత, సామాజిక భద్రత కోసం కింది డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. ప్రధాన డిమాండ్లుచేతివృత్తిదారుల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ/శాఖను ఏర్పాటు చేసి, ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. ప్రతి చేతివృత్తిదారునికి రూ. 5 లక్షల వరకు ఆర్థిక సహాయం, 50 శాతం సబ్సిడీతో, బ్యాంకు లింకేజీ లేకుండా నేరుగా అందించే విధానం అమలు చేయాలి. వృత్తిదారులు తమ వృత్తిని అభివృద్ధి చేసుకునేందుకు వడ్డీ లేని లేదా తక్కువ వడ్డీ రుణాలు అందించాలి. 50 సంవత్సరాలు దాటిన చేతివృత్తిదారులకు నెలకు రూ. 6,000 సామాజిక పింఛన్ ఇవ్వాలి. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ప్రత్యేక భద్రత కల్పించాలి. ప్రతి చేతివృత్తిదారుల కుటుంబానికి సొంత ఇంటి స్థలం కల్పించి, ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వ సహాయం అందించాలి. చేతివృత్తిదారుల పిల్లలకు ఉచిత విద్య, హాస్టల్, స్కాలర్‌షిప్‌లు కల్పించాలి. వృత్తిదారుల ఉత్పత్తులకు ప్రభుత్వ మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి, మధ్యవర్తుల దోపిడీని అరికట్టాలి. రజక, మంగలి తదితర వృత్తిదారులకు ఆధునిక పరికరాలు, పనిముట్లు ఉచితంగా లేదా భారీ సబ్సిడీతో అందించాలి. వృత్తిదారుల ఉత్పత్తుల విక్రయానికి ప్రత్యేక మార్కెట్లు, షాపింగ్ సెంటర్లు, ప్రదర్శనా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. చేతివృత్తిదారుల కుటుంబాలకు ఉచిత విద్యుత్/వృత్తి అవసరాలకు రాయితీ విద్యుత్ కల్పించాలి. వృత్తి చేసుకునే కుటుంబాలకు నెలవారీ ఆర్థిక సహాయం అందించాలి. చేతివృత్తిదారుల ఇళ్లకు ఉచితంగా తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలి. వృత్తిదారులకు ఆరోగ్య బీమా, ప్రమాద బీమా సదుపాయాలు కల్పించి, కుటుంబానికి వైద్య భద్రత కల్పించాలి. వృత్తిదారుల పిల్లలకు 25 సంవత్సరాల వరకు విద్యా సహాయం/స్కాలర్‌షిప్‌లు అందించాలి. వృత్తిదారుల ఉత్పత్తులకు ప్రభుత్వ కొనుగోలు విధానం అమలు చేసి, ప్రభుత్వ శాఖలు వారి ఉత్పత్తులను కొనుగోలు చేయాలి. గీత కార్మికులకు తాటి చెట్లు, ఈత చెట్లపై హక్కులు కల్పించి, వృత్తి చేసుకునేందుకు రక్షణ, రాయితీలు అందించాలి. కుమ్మరి వృత్తిదారులకు మట్టి, చక్రాలు, ఆధునిక పరికరాలు అందించి, వృత్తి అభివృద్ధికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వృత్తిదారుల సంఘాలకు, సహకార సంఘాలకు ఆర్థిక సహాయం పెంచాలి. ప్రతి చేతివృత్తిదారుల కుటుంబానికి ఇంటి స్థలం, కనీసం 3 సెంట్లు పట్టణాల్లో, 5 సెంట్లు గ్రామాల్లో కేటాయించి, గృహ నిర్మాణానికి ప్రత్యేక పథకం అమలు చేయాలి. వృత్తిదారుల అనుభవాన్ని గుర్తించి, వారి నైపుణ్యానికి ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలి. యువతకు ఆధునిక సాంకేతికతతో కూడిన శిక్షణ అందించాలి. చేతివృత్తిదారుల కుటుంబాల్లో ఉపాధి కోల్పోయిన వారికి నెలకు కనీసం రూ. 20,000 వరకు ఉపాధి/ఆర్థిక సహాయం అందించే ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలి. చేతివృత్తులు కేవలం ఒక వృత్తి కాదు తరతరాలుగా వస్తున్న మన సంప్రదాయం, సంస్కృతి, జీవనాధారం. వాటిని కాపాడటం ప్రభుత్వ బాధ్యత. పై డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి, చేతివృత్తిదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు బి బి రాముడు, దళిత హక్కుల పోరాట సమితి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి సి మహేష్, చాకలి మునెమ్మ సి రమణయ్య, చాకలి రమేష్ పాల్గొన్నారు.

# గ్రూప్ -1 పరీక్షలకు హాజరయ్యే... మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

### ఎంపిక కోసం రాష్ట్రస్థాయిలో ప్రవేశ పరీక్షలి
### రేపటినుండి సెప్టెంబరు 10 వరకు దరఖాస్తుకు అవకాశం
### మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి

**అమరావతి, ఆగస్టు29. నంది పత్రిక:**రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జాబ్ క్యాలెండర్-2026కు పోటీపడే మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఉచిత శిక్షణ కోసం అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ప్రత్యేక ప్రవేశ పరీక్షను నిర్వహించబోతున్నట్లు శనివారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 పరీక్షలకు మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడిఎం)-ఏపీ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వబోతునట్లు ఇప్పటికే ప్రకటించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. మైనారిటీ సమాజానికి చెందిన నిరుద్యోగ యువత ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడి, సమాజంలో సమున్నత స్థానాన్ని అందుకోవాలన్నదే సీఎం చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.



**అభ్యర్థుల ఎంపిక కోసం ప్రవేశ పరీక్ష** మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఆన్ లైన్ తో పాటు ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించడం జరుగుతుందని మైనారిటీ మంత్రి ఫరూక్ తెలిపారు. అత్యంత పారదర్శకమైన పద్ధతిలో ఉచిత శిక్షణా తరగతులకు అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో వివిధ కేంద్రాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించబోతున్నట్టు మంత్రి తెలిపారు. ఈ ప్రవేశపరీక్ష లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థుల కు మాత్రమే ఉచిత శిక్షణ పొందే అర్హత లభిస్తుందన్నారు. అర్హత, ఆసక్తి కలిగినరాష్ట్ర వ్యాప్త మైనారిటీ అభ్యర్థులందరూ తమ వివరాలను "సిఈడిఎం-ఏపీ" అధికారిక వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ పద్ధతిలో నమోదు చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఆఫ్ లైన్ శిక్షణా తరగతులకు దరఖాస్తు చేసుకునే వారు డిగ్రీలో కనీసం 60% మార్కులు పొంది, తెల్ల రేషన్ కార్డ్ కలిగిన కుటుంబాలకు చెందిన వారై ఉండాలన్నారు. ఆన్ లైన్ శిక్షణ కోరుకునే మైనారిటీ అభ్యర్థులకు మాత్రం పై నిబంధన వర్తించదని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్: ఒఒఒ.ఖజూఎవసఎఎఒ.శీతీస్ర లేదా 08645-297535, 7386789966 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ప్రవేశ పరీక్షకు ఆన్ లైన్ దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 31వ తేది నుండి ప్రారంభమై సెప్టెంబరు 10 వ తేదితో ముగుస్తుందని తెలిపారు. అభ్యర్థుల కనీస అర్హతలు, ప్రవేశ పరీక్ష కు సంబంధించిన పూర్తి షెడ్యూల్, ఇతర ముఖ్య వివరాలు సిఈడిఎం-ఏపీ అధికారిక వెబ్ సైట్ లో పొందుపరచడం కూడా జరిగిందని తెలిపారు.

**గ్రూప్-2 పరీక్షల ఉచిత శిక్షణ కోసం ప్రత్యేక ప్రకటన**

కూటమి ప్రభుత్వ ప్రతిష్టాత్మక జాబ్ క్యాలెండర్ -2026 లో భాగంగా త్వరలో విడుదలయ్యే గ్రూప్ -2 ఉద్యోగ నోటిఫికేషన్ ను దృష్టిలో వుంచుకొని గ్రూప్ -2 ఉద్యోగార్థులకు కూడా ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని మంత్రి ఫరూక్ తెలిపారు. ఇందుకోసం మైనారిటీ సంక్షేమ శాఖ ప్రత్యేకంగా ప్రకటన జారీ చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిపుణులైన అధ్యాపకులతో అందిస్తున్న ఉచిత శిక్షణను మైనారిటీ యువత సువర్ణ అవకాశంగా భావించి, పట్టుదలతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆకాంక్షించారు.

# ధరలను అదుపు చేయకపోతే కూటమి ప్రభుత్వ పతనం తప్పదు: సిపిఎం

## ఎన్నికల్లో బూటకపు హామీలను చెప్పి గద్దెనెక్కినారు. అదే వారి పతనానికి కారణమవుతుంది

**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 29 . (నంది పత్రిక ):**పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు, సరుకుల ధరలను ముఖ్యంగా కంది బేడలు, నూనె, ఉల్లిగడ్డ,చక్కెర, బెల్లం, బియ్యం లాంటి వస్తువుల ధరలను అదుపు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలే రాబోయే కాలంలో బుద్ధి చెప్తారని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూటమి ప్రభుత్వం పతనం తప్పదని హేచ్చరిస్తూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఉల్లిగడ్డలు, మిరపకాయ లతో కూడిన దండలను మెడలో ధరించి, సరుకులను ముందు బాగాన ఉంచి వినూత్నంగా గాంధీ చౌక్ సెంటర్లో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్,పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా. నరసింహ,కే మహ్మద్ గౌస్,పి. వెంకటలింగం ,మౌలాలి,సీనియర్ నాయకులు తోట మద్దులు, పట్టణ నాయకులు జైలాన్, వీరితోపాటు ప్రజాసంఘాల నాయకులు రమేశబాబు ,శివలింగం, మద్దిలేటి, రానా, నరసింహ, వెంకటేశ్వర్లు మరో 20 మంది కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి వెంకట లింగం అధ్యక్షత వహించగా సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్,పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా. నరసింహ,కే మహ్మద్ గౌస్,సీనియర్ నాయకులు తోట మద్దులు లు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రము లోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందుకు ధరల ను అదుపు చేసి పేద ప్రజల సంక్షేమాన్ని పట్టించుకుని వారి జీవితాలలో వెలుగులు నింపేలా చూస్తామని చెప్పి మూడుసార్లు గద్దెనెక్కి ప్రజల పైన బారాలు వేయడమే పనిగా పెట్టుకుని పెట్టుబడిదారులకు కార్పొరేషన్లకు ఊడిగం చేసేటువంటి దుర్మార్గమైనటువంటి విధానాలను అవలంబిస్తున్నారని ముఖ్యంగా మోడీ ప్రభుత్వం అంబానీ అదాని సేవలో తరిస్తూ పెట్రోలు, డీజీలు, వంట గ్యాస్ ధరలను తగ్గించకపోవడం చాలా దుర్మార్గమని, అమెరికా- ఇరాన్ ల మధ్య యుద్ధం జరుగుతూ ఉండడం వలన ధరలను పెంచుతున్నామని ప్రజల పైన సిగ్గు లేకుండా బారాలు వేసి నేడు ప్రపంచవ్యాప్తంగా కృడాయిల్ ధరలు భారీగా, సగానికి పైగా తగ్గిన మనదేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించకపోవడం చాలా దుర్మార్గమని, వీటి ధరలు పెరగడం వలన నిత్యవసర వస్తువుల ధరలు, సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని సామాన్యుడు బతకాలంటే వీటిని కొనే పరిస్థితిలో లేరని ఏమి కొనాలి అన్న, ఏమి తినాలన్నా ధరలను చూస్తే గుండె పగిలేలా ఉన్నాయని సామాన్యుడు విలవిల్లాడుతున్నారని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరుచుకుని ప్రజల సంక్షేమం కోసం ధరలను అదుపు చేయాలని లేకుంటే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పంచాయతీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని కూకటివేళ్ళ తో పెకలించి వేసేందుకు ప్రజలు ఆలోచిస్తున్నారని ఎప్పుడూ ఎన్నికలు వస్తాయా కూటమి ప్రభుత్వాన్ని ఏ విధంగా ఇంటికి సాగనంపాలినా నాయకులను ఏ విధంగా తరిమి తరిమి కొట్టాలి నా అని ప్రజలు ఆలోచన చేస్తున్నారని ఇప్పటికైనా గానీ ధరలను అదుపు చేయాలని ఇప్పటికే నాగుల చవితి లాంటి పండగలు ప్రజలు చేసుకోవడానికి లేకుండా పోయిందని ముఖ్యంగా బియ్యం, కందిబేళ్లు, బెల్లం, చక్కెర, నూనె లాంటి ధరలు 200 % పైగా పెరగడము ప్రజలు వీటిని కొనే పరిస్థితిలో లేక పండుగలు కూడా జరుపుకునే పరిస్థితిలో లేరని, ప్రస్తుతము ఉన్న ఎల్లినో వలన వర్షాలు రాక ప్రజలు రైతులు కరువుతో అల్లాడుతుంటే ధరలను ఆకాశాన్ని అంటే రీతిలో ప్రభుత్వం పెంచుకుంటూ పోతుంటే ప్రజల కళ్ళల్లో ఈ ధరలను చూస్తే కన్నీళ్లు వాటంతటావే రాలిపోతున్నాయని, ఆ కన్నీటికి కారణమైన కూటమి ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. రాబోయే కాలంలో మున్సిపాలిటీలు, పంచాయతీ ఎన్నికల్లో సత్తా చూపిస్తామని ప్రగల్బాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల సత్తా ఏందో చూపించే అవకాశం ఇచ్చిందని, కూటమి ప్రభుత్వంలో ఉన్న నాయకులు, కార్యకర్తలు తమ ఇళ్ల దగ్గరికి వస్తే ప్రజలు తరిమి తరిమి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.




## శాంతిరామ్ ఇంజనీరింగ్ కళా శాల క్రీడా పోటీలు




**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 29 . (నంది పత్రిక ):**స్థానిక నెరవాడ సమీపంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వివిధ విభాగాల మధ్య క్రీడా పోటీలు నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ బ్యాడ్మింటన్ చదరంగం మరియు బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నిర్వహించారని గెలుపొందిన క్రీడా కారులకు ప్రశంసా పత్రము మరియు మెడల్స్ అందజేశారని తెలిపారు. విజేతలుగా నిలిచిన బాల బాలికలకు అధ్యాపక బృందం మరియు అధ్యాపకేతర బృందం అభినందనలు తెలిపారు.

# ఏపీ పోలీసు స్పోర్ట్స్ మీట్‌కు కర్నూలు రేంజ్ క్రీడాకారుల సన్నద్ధత.

### పోలీసు అధికారులు, సిబ్బందికి స్పోర్ట్స్ కిట్లు అందజేసిన కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్పోర్ట్స్ మీట్ గుంటూరు లో ( సెప్టెంబర్ 1 తేదీ నుండి సెప్టెంబర్ 3 వరకు ) మూడు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో కర్నూలు రేంజ్ నుంచి పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఐపీఎస్ శనివారం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో స్పోర్ట్స్ కిట్లను అందజేశారు ఈ సందర్భంగా కర్నూలు రేంజ్ డీఐజీ గారు పోలీసు క్రీడాకారులను అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి కర్నూలు రేంజ్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని డీఐజీ తెలిపారు. ఏపీ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కర్నూలు రేంజ్‌కు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐలు చంద్రబాబు నాయుడు, తేజామూర్తి, తిక్కస్వామి, ఆర్ఐలు, ఎస్ఐలు, స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిమ్ చేయండి ఆరోగ్యంగా ఉండండి

### లక్ష్మినగర్ పార్కులో నూతన ఓపెన్ జిమ్ ప్రారంభం



**హైదరాబాద్. ఆగస్ట్ 29 . (నంది పత్రిక ):**హైదరాబాద్ (అత్తాపూర్) నగర ప్రజల ఆరోగ్యం శారీరక దృఢత్వమే లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లక్ష్మీ నగర్ పార్క్ లో నూతనంగా ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్ చేయండి ఆరోగ్యంగా ఉండండి అనే నినాదంతో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అత్తాపూర్ వాకర్స్ అసోసియేషన్ మరియు యోగ సెంటర్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా సీనియర్ సభ్యులు పంచకేశ్వరరావు విజయశ్రీ దంపతులు సాంప్రదాయబద్ధంగా కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి జిమ్ పరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నగర్ పార్క్ అసోసియేషన్ అధ్యక్షులు యోగ గురువు మహేందర్ మాట్లాడుతూ మారుతున్న జీవనశైలిలో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యాన్నిపెంపొందించు కోవాలన్నారు సంపూర్ణ ఆరోగ్య కోసంయోగ జిమ్ మరియు నడక ధ్యానం అనేవి ముఖ్యమైన సాధనాలు అని ఆయన పిలుపునిచ్చారు. పార్కుకు వచ్చే కాలనీవాసులు యువత మరియు సీనియర్ సిటిజన్లో ఓపెన్ న్యాస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. హాజరైన వారిలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీ కలికి మూర్తి ఎం ప్రభాకర్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నరసింహారావు వెంకటపతి రాజు వెంకటరెడ్డి శ్రీ బాబురావు తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నేదునూరి నేదునూరి కనకయ్య అత్తాపూర్ యోగ సెంటర్ సభ్యులు లక్ష్మిచంద్రారెడ్డి శ్రీ సాయి విజయ్ చారి మనోహర్ రావు కుమార్ రెడ్డి విజయ రవి ప్రసాద్ మరియు ప్రమీల రేఖలు పాల్గొన్నారు. ఈ నూతనా ఓపెన్ జిమ్ ఏర్పాటు పట్ల లక్ష్మీ నగర్ కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ జిహెచ్ఎంసి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# తెలుగు భాషా క్రీడా దినోత్సవ వేడుకలు.



**రుద్రవరం ప్రతినిధి ఆగస్టు 29 (నంది పత్రిక):** రుద్రవరం ఏపీమోడల్ స్కూల్ & జూనియర్ కాలేజ్ లో తెలుగు భాషా దినోత్సవం మరియు క్రీడా దినోత్సవం సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యత ను దివాకర్ ,హబీబా తెలుగు సాహిత్యం, మాతృభాష గొప్పతనం గురించి అవగాహన కల్పిస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు వ్యాస రచన పోటీలు కూడా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అలాగే క్రీడల ప్రాముఖ్యతను పి డీ శ్రీనివాసులు తెలియజేస్తూ విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు మరియు క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్ పెంపొందుతాయని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాలు తెలుగు ఉపాధ్యాయులు దివాకర్ , హబీబ్ రజినీ ఈరన్న పి. డి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు మాట్లాడుతూ మాతృభాషను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు తెలుగు భాషను ప్రేమిస్తూ సాహిత్య, సాంస్కృతిక మరియు క్రీడా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులందరికీ ప్రిన్సిపాల్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



నంది పత్రిక
ఆదివారం 30 - 08 -2026

# స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి యువత, గెన్ జడ్ తో పాటు
# అనుభవజ్ఞులు కూడా ముందుకు రావాలి

**సెప్టెంబర్ 15లోగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని సంప్రదించాలి**

**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు క్రాంతి నాయుడు బోయ**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయడానికి ఆసక్తి ఉన్న నాయకులు, కార్యకర్తలు, యువత, గెన్ జడ్ తో పాటు గతంలో ప్రజా జీవితంలో పనిచేసిన అనుభవజ్ఞులు కూడా ముందుకు రావాలని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది క్రాంతి నాయుడు బోయ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి పత్రిక ప్రకటన విడుదల చేస్తూ గతంలో జడ్పీటీసీ , ఎంపీటీసీ , సర్పంచ్, కౌన్సిలర్ తదితర స్థానాల్లో పనిచేసిన వారు, అలాగే గతంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసి, ప్రస్తుతం పార్టీకి దూరంగా ఉన్నప్పటికీ మళ్లీ కాంగ్రెస్ పార్టీతో కలిసి ప్రజల కోసం పనిచేయడానికి సిద్ధంగా ఉన్న వారందరికీ పార్టీలోకి రావడానికి స్వాగతంపలుకుతున్నామని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ప్రజలతో అనుబంధం, స్థానిక పరిస్థితులపై అనుభవం ఉన్న ఇలాంటి నాయకుల సేవలు కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, గెన్ జడ్ మరియు యువత రాజకీయాల్లోకి పెద్ద సంఖ్యలో రావాలని ఆయన ప్రత్యేకంగా కోరారు. కొత్త ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శకత, సామాజిక బాధ్యతతో కూడిన యువ నాయకత్వం స్థానిక ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయగలదని అన్నారు. "పదవుల కోసం మాత్రమే కాకుండా, ప్రజల సమస్యలపై ప్రశ్నించడానికి, ప్రజల తరఫున గొంతుకగా నిలబడటానికి, తమ గ్రామం, వార్డు, పట్టణం అభివృద్ధి కోసం బాధ్యత తీసుకోవడానికి సిద్ధంగా ఉన్న ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి" అని క్రాంతి నాయుడు పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్, సర్పంచ్, కౌన్సిలర్, కార్పొరేటర్, మున్సిపల్ చైర్మన్, మేయర్, జడ్పీటీసీ , ఎంపీటీసీ తదితర పదవులకు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయాలనుకునే ఆసక్తి ఉన్న వారు తమ పూర్తి వివరాలతో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. సెప్టెంబర్ 15, 2026లోగా ఆసక్తి ఉన్న వారు తమ వివరాలను జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి అందజేయాలని తెలిపారు. ప్రజల కోసం పనిచేయాలనే సంకల్పం ఉన్న ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ పార్టీ తలుపులు తెరిచి ఉన్నాయి అనుభవం ఉన్నవారికి గౌరవం, యువతకు అవకాశం, ప్రజల కోసం పోరాడే వారికి వేదిక కల్పించడమే మా లక్ష్యం అని క్రాంతి నాయుడు తెలియజేశారు.

# నగర రూపురేఖలు మార్చేలా సుందరీకరణ

**9 ప్రధాన కూడళ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక**

**కూడళ్లలో టర్ఫ్ గడ్డి, వాటర్ ఫౌంటెన్ల అభివృద్ధి**

**డివైడర్లు, నడకబాటలకు కొత్త రూపు**

**పచ్చదనం, ఆకర్షణీయమైన చిత్రాలతో నగర సుందరీకరణ**

**నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు**




**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరాన్ని మరింత సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రధాన కూడళ్లు, రహదారులు, డివైడర్లు, నడకబాటల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శనివారం ఆయన నగరంలోని 5 రహదారుల కూడలిలో చేపట్టిన ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని 9 ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. కూడళ్లలో టర్ఫ్ గడ్డి అమర్చడం, వాటర్ ఫౌంటెన్ల మరమ్మత్తులు చేపట్టడం కోసం సుమారు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రధాన రహదారుల వెంట ఉన్న డివైడర్లకు ఆకర్షణీయమైన రంగులు వేయడంతో పాటు, నడకబాటలకు అవసరమైన మరమ్మత్తులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా రహదారుల వెంట పచ్చదనం పెంపొందించడం, మొక్కలు నాటడం, గోడలపై ఆహ్లాదకరమైన చిత్రాలను ఏర్పాటు వేయడం వంటి పనులు చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. నగరానికి వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా సుందరీకరణ పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేస్తామన్నారు. కూడళ్ల అభివృద్ధితో పాటు నగర పరిశుభ్రత, పచ్చదనాన్ని కాపాడేందుకు ప్రజలు సైతం సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో హార్టికల్చర్ ఏడి ప్రతాప్ రెడ్డి, డిఈఈ కృష్ణలత, తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతపరచాలి






**విజయవంతమైన రెడ్ క్రాస్ సర్వసభ్య సమావేశం**

**రక్తదానం, అవయవదానం, ఆరోగ్య సేవలపై ద విస్తృత అవగాహన కల్పించాలి**

**పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు రెడ్‌క్రాస్ సంస్థతో భాగస్వామ్యం కావాలి**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**సమాజ సేవలో రెడ్ క్రాస్ సొసైటీ పాత్ర కీలకమైంది**

**జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**

**నంద్యాల బ్యూరో, ఆగష్టు29(నంది పత్రిక):-** నూతన జిల్లా గా ఏర్పడిన సమయంలో రెడ్‌క్రాస్ సొసైటీకి సొంత భవనం, బ్లడ్ స్టోరేజ్ యూనిట్ వంటి మౌలిక సదుపాయాలు లేని పరిస్థితి నుంచి ప్రస్తుతం అనేక సేవలను అందించే స్థాయికి తీసుకురావడం చాలా గర్వకారణం అని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమార్ గనియా అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెడ్క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వాటర్ రిసోర్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పాత జపాన్ ప్రాజెక్టు భవనాన్ని రెడ్‌క్రాస్ సొసైటీకి కేటాయించి, అవసరమైన ఆధునీకరణ పనులు చేపట్టి సొంత భవనంగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రజలకు అత్యవసర సమయంలో రక్తం అందుబాటులో ఉండేలా ఫ్రీజర్లు, ఏసీలు, ల్యాబ్ టెక్నీషియన్ తదితర సదుపాయాలతో బ్లడ్ స్టోరేజ్ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రక్తదానంపై యువత, మహిళల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేసేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రెడ్‌క్రాస్ భవనానికి విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు నేడ్ క్యాప్ మార్గదర్శకత్వంలో పూర్తి స్థాయి సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు తక్కువ ధరలకు మందులు అందుబాటులో ఉండేలా జిజి హెచ్ ఆవరణలో స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తల సహకారంతో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. డోన్, శ్రీశైలం ప్రాంతాలతో పాటు ఎన్ హెచ్ -40, ఎన్ హెచ్ -340సి జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ కొత్తగా బ్లడ్ స్టోరేజ్ యూనిట్లు, జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అవయవదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, అవయవదాన ప్రాముఖ్యతపై విస్తృత అవగాహనకల్పించాలన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో కుటుంబాలకు అవయవదానం ద్వారా లభించిన ప్రయోజనాలతో పాటు ప్రభుత్వ బీమా పథకం ద్వారా సుమారు రూ.1 కోటి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది అన్నారు. రైల్వే స్టేషన్ పరిసరాల్లోని నిరాశ్రయులు, యాచకులకు ఆశ్రయం కల్పించేందుకు మెప్మా , స్వచ్ఛంద సంస్థల సహకారంతో నైట్ షెల్టర్లను రెడ్‌క్రాస్ పర్యవేక్షణలోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తృతం చేసేందుకు సభ్యత్వాలను పెంచాలని, జిల్లాలోని పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు రెడ్‌క్రాస్‌తో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల ప్రాణాలను కాపాడే రక్తదానం, అవయవదానం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సిపిఆర్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ, వైద్య శిబిరాలు, ఆరోగ్య సేవలు వంటి కార్యక్రమాల్లో రెడ్‌క్రాస్ మరింత చురుకైన పాత్ర పోషించాలని తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ. సమాజంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన మానవతా సేవా కార్యక్రమాలను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహిస్తుందని తెలిపారు. రక్తదాన శిబిరాల నిర్వహణ, విపత్తుల సమయంలో బాధితులకు సహాయక చర్యలు అందించడం అత్యవసర సమయాల్లో ప్రజలకు అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాల్లో రెడ్‌క్రాస్ సంస్థ చేరువుగా ఉందన్నారు. లిరెడ్‌క్రాస్ సొసైటీకి జిల్లా కలెక్టర్ నిరంతరం ఆర్థికంగా, పరిపాలనాపరంగా అన్ని విధాలా మద్దతు, సహకారం అందిస్తున్నారని జిల్లా ఎస్పీ అభినందించారు. జిల్లా యంత్రాంగం సహకారంతో నంద్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరించేందుకు అవకాశం ఉందన్నారు. ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన మందులు అందుబాటులో ఉండేలా జన్ ఔషధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయనీ ఇటువంటి ప్రజా ఉపకార కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని అన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఫుట్‌పాత్‌లపై రాత్రి వేళల్లో ఆశ్రయం లేకుండా ఉంటున్న వృద్ధులు, నిరాశ్రయుల కోసం ప్రత్యేకంగా హోమ్‌లెస్ సెంటర్ (ఆశ్రయ కేంద్రం) ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవడంతో పాటు జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. లిపోలీసు సిబ్బందికి రెగ్యులర్ మెడికల్ క్యాంపులు రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ, అనేక సందర్భాల్లో సరైన సమయానికి ఆహారం తీసుకోలేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు అవసరమన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి క్రమం తప్పకుండా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా వారి విధి నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడుతుందన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గౌరవ జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ అందించిన విలువైన సలహాలు, సూచనలను తప్పకుండా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. "తక్కువ ప్రసంగాలు ఎక్కువ సేవా కార్యక్రమాలు" అనే లక్ష్యంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు రెడ్‌క్రాస్ సభ్యులు, వాలంటీర్లు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెడ్ క్రాస్ జిల్లా కోశాధికారి డాక్టర్ అరుణ కుమారి గారు 2024 25 సంవత్సరాలలో 2025 26 సంవత్సరాలలో రెడ్క్రాస్కు అందిన నిధులు వాటికి పెట్టిన ఖర్చుల వివరాలు, భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాల గురించి అన్నిటిని సభ్యులకు, అతిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ మమతారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు మారుతి కుమార్, ఉస్మాన్ భాష, డాక్టర్ నిషిత రెడ్డి, యాకూబ్, సురేంద్ర, నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాల్లో రక్తదాన శిబిరాల్లో ఫస్ట్ ఎయిడ్ సిపిఆర్ తదితర అవగాహన సదస్సులో పాల్గొని విశేష సేవలు అందించిన పలువురికి జిల్లా కలెక్టర్, ఎస్పీ ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రెడ్ క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# రాఖీ పౌర్ణమి సందర్భంగా క్రాంతి నాయుడు కి మరియు నాయకులకు రాఖీ కడుతున్న జిల్లా మహిళా అధ్యక్షురాలు మీసాల సుమలత



**కర్నూల్ సిటీ నంది పత్రిక** తమ సోదరుల మణికట్టుకు పవిత్రమైన దారాన్ని కట్టి ఆయురారోగ్యాలతో అష్టశ్వర్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆడపడుచులు కోరే పండుగే రాఖీ పండగా అని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు న్యాయవాది బోయ క్రాంతి నాయుడు తెలిపారు. రాఖీ పండగ సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులతోపాటు ఇతరులకు మహిళా సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత రాఖీ కట్టి రాఖీ పండగ సంబరాలు జరిపారు.

# గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు




**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 29 ( నంది పత్రిక )** బాబా నగర్ శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు అట్టహాసంగా నిర్వహించినట్టుగా స్కూల్ డైరెక్టర్ పి షేక్షావల్లి రెడ్డి తెలిపారు. జాతీయ క్రీడ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థుల్లో క్రీడా ప్రతిభాపాటవాలను వెలికి తీసి వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని సదుద్దేశంతో పాఠశాలలోని విద్యార్థులను కలింగ ,మగధ, పల్లవ, శాతవాహన అని గ్రూపులుగా విభజించి హ్యాండ్ బాల్, ఫుట్బాల్, క్రికెట్ ,అథ్లెటిక్స్ వంటి క్రీడలను నిర్వహించడమైనది. ఈ జాతీయ క్రీడా దినోత్సవంనకు గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి దస్తగిరి రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి జాతీయ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి శ్రీ మేజర్ ధ్యాన్చంద్ చిత్రపటానికి పూలమాలవేసి వందన సమర్పణ గావించారు. వివిధ రకాల క్రీడా పోటీ నందు విజేతలుగా నిలిచిన 120 మంది క్రీడాకారులకు గోల్డ్ , సిల్వర్, బ్రాంజ్ మెడల్ తో పాటు ట్రోఫీలను అందజేసి విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల పిరమిడ్ విన్యాసాలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరింప చేశాయి. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యదశలో నుండి క్రీడలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి 10 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అన్ని వసలతో కూడిన క్రీడ మైదానాన్ని ఏర్పాటు చేసి సుశిక్షితులైన వ్యాయామ ఉపాధ్యాయులచే అన్ని క్రీడలు యందు విద్యార్థులను మమేకం చేస్తూ వారిని ఆల్రౌండర్ గా తీర్చిదిద్దుతున్నామనుటకు మేము నిర్వహిస్తున్న క్రీడలే దీనికి నిదర్శనమని కొనియాడారు ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.






# గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ నందు ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుక




**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 29 ( నంది పత్రిక )** బాబా నగర్ శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ ఓపెన్ ఆడిటోరియం లో వ్యవహారిక భాషా పితామహుడు ఉద్దండ పండితుడు శ్రీ గిడుగు వేంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లుగా స్కూల్ డైరెక్టర్ పి షేక్షావలి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ ఎంతోమంది విద్యార్థులను ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దిన విద్యావేత్త డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి విచ్చేసి తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలవేసి వందన సమర్పణ గావించారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని అంతర్ పాఠశాలలో భాగంగా విద్యార్థులలో భాష, విషయ, సాహిత్య పరిజ్ఞానాన్ని బాల్య దశలోనే పెంపొందించాలని సదుద్దేశంతో పద్య పఠనం( శతక పద్యములు) కవితా రచన (అమ్మ భాష గొప్పతనం ) లేఖా రచన ,వక్తృత్వం, అనగనగా కథ చెబుతా వింటారా వంటి పోటీలను నిర్వహించడమైనది. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ప్రథమ బహుమతిగా రామాయణం...ద్వితీయ బహుమతిగా మహాభారతం...తృతీయ బహుమతిగా భాగవతం...ప్రత్యేక బహుమతిగా పంచతంత్రం పుస్తకాలను విద్యార్థులకు అందజేసి వాటితో పాటు గోల్డ్, సిల్వర్ ,బ్రాంజ్ మెడల్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల పద్య పఠనం, కవిత గానం, ఉపన్యాసాలు కిండర్ గార్డెన్ చిన్నారుల కథ చెబుతా వింటారా అలతి అలతి పదాలతో అలరించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు బాల్య దశలోనే భాష పై మమకారాన్ని, చక్కని పటుత్వాన్ని అలవర్చుకున్నప్పుడే భవిష్యత్తులో గొప్పనైన వ్యక్తులుగా సమాజానికి తోడ్పడే విధంగా తయారవుతారని విద్యార్థులకు తెలియజేశారు.

ఈ సందర్భంగా విద్యార్థుల భాషాభివృద్ధి కోసం కృషి చేస్తున్న తెలుగు ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

# కూటమి పాలనలో వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిన్నది



**మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి**
**సెప్టెంబర్ 1వ తేది... సాగునీటి సాధన కోసం ...వెలుగోడు రిజర్వాయర్ వద్ద భారీ ధర్నా విజయవంతం చేయండి... మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి**
**రాయలసీమ రైతాంగ సమస్యలపై రైతన్నలతో సమావేశం**
**కూటమి ప్రభుత్వంపై నిరసనలకు పిలుపు**

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 29 ( నంది పత్రిక )** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, రాయలసీమ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో రైతులతో కలిసి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి హెచ్చరించారు. సెప్టెంబర్ 1వ తేది... సాగునీటి సాధన కోసం ...వెలుగోడు రిజర్వాయర్ వద్ద రైతులతో వైసీపీ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపడుతున్నట్లు , ఈ నిరసన కార్యక్రమంలో రైతులు, రైతు సంఘం నేతలు, వైసీపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సి.ఈ.సి. నెంబర్ పీపీ నాగిరెడ్డి, నంది రైతు సమైక్య అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, రైతు సంఘం నాయకులు అరికట్ల శివరామకృష్ణారెడ్డి, శివారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, రైతు నాయకులు తదితరులు పాల్గొన్నారునంద్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వారి నుండి అభిప్రాయాలను, సూచనలను స్వీకరించి భవిషత్తు కార్యాచరణ పై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వ్యవసాయానికి సంబంధించి రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత పాలనలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, గిట్టుబాటు ధరలు లేక, సకాలంలో ఆదుకునే నాథుడు లేక అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. పండించిన పంటకు సరైన ధరలు కల్పించడంలోనూ, సాగునీరు అందించడంలోనూ కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతుల హక్కులను కాపాడుకోవడానికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అన్నదాతలకు అండగా నిలబడేందుకు రాబోయే రోజుల్లో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని, క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టి అధికారులను, ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. రైతుల పక్షాన వైసిపి ఎల్లప్పుడూ పోరాడుతుందని, న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నంద్యాల నియోజకవర్గానికి చెందిన పలువురు రైతు నాయకులు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి.. జనసేన



**కోవెలకుంట్ల ఆగష్టు 29నందిపత్రిక** జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 2 న చేపడుతున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని జనసేన నియోజకవర్గ నాయకులు దొడియం గురప్ప, ప్రసాద్, షేక్షావలి కోరారు.శనివారం బనగానపల్లిలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బనగానపల్లి మండలం పాతపాడు గ్రామంలో జనసేన నాయకులు షేక్షావలి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలలో భాగంగా శ్రీ యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాతపాడు గ్రామంలో కేక్ కటింగ్ అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, మెగా అభిమానులు కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెగా యూత్ ఫోర్స్ జాయింట్ కన్వీనర్స్ యుగంధర్, అజయ్,రామకోటి పాల్గొన్నారు

# ప్రతి ఇంటికి కూటమి సంక్షేమ ఫలాలు:::: సింగిల్ విండో చైర్మన్ ఎ. షహబుద్దిన్.



**నంది పత్రిక ఆత్మకూరు..** శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న"రెండేళ్ల సుపరిపాలన – అభివృద్ధి, సంక్షేమం"అనే కార్యక్రమం ఈరోజు ఆత్మకూర్ మున్సిపాలిటీ లోని 8 వ వార్డు నందు జరిగింది. దీనిలో భాగంగా ఆత్మకూర్ సింగిల్ విండో చైర్మన్ షహబుద్దిన్ పాల్గొని ఇంటింటికి తిరుగుతూ ఈ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి చేసిన అభివృద్ధి మరియు ప్రతి ఇంటికి అందుతున్న సంక్షేమ ఫలాల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. వీరి వెంట యూనిట్ ఇంచార్జ్ మోమిన్ షాకీర్, వార్డు అధ్యక్షులు వి ఎస్ మున్నా, బూతు ఇంచార్జ్ లు అన్వర్ భాష, మహబూబ్ బాషా, జలీల్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు విఎస్ .ఖలీల్, ఇర్ఫాన్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

# కుంటలు, చెరువులు ఎండిపోతున్నాయి...





**శ్రీశైలంలో నీరు నిల్వలు ఉన్నాయని చెబుతున్నారు దిగువకు నీరు వదలరా?**
**ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి...**

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 29 ( నంది పత్రిక )** వార్షాభావ పరిస్థితుల్లో రైతులకు పంటలు సాగు చేసేందుకు, ప్రజలకు, పశువులకు త్రాగునీరు లేక విలవిల లాడిపోతున్న పరిస్థితిలో... అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం శ్రీశైలంలో నీటి నిల్వలు ఉన్నాయని చెబుతున్నారని, అయితే దిగువకు నీటిని ఎందుకు వదలడంలేదో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి సూటిగా ప్రశ్నిస్తున్నారు. నంద్యాల మండలంలోని మిట్నాల గ్రామానికి చెందిన నీటి కుంటలో చుక్కనీరులేక ఎండిపోయిన దుస్థితిని చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే నంద్యాల పట్టణ శివారులోని చిన్నచెరువుకూడా ఎండి పోవడాన్ని నేడు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డిమాట్లాడుతూ... గత 24 సంవత్సరాల తర్వాత నంద్యాల మండలం మిట్నాల గ్రామ కుంట ఎండిపోయిందని పేర్కొన్నారు. దుర్భిక్షపరిస్థితిలో ఉన్న రైతులకు, ప్రజలకు, పశువులకు కనీసం నీరు అందించే పరిస్థితిలో కూటమి ప్రభుత్వం లేదని విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నీరు నిల్వ ఉందని త్రాగునీటిని విడుదల చేస్తామని ప్రజలకు ఒట్టి మాటలు చెబుతూ కాలం గడిపేస్తున్నారని పేర్కొన్నారు. కనీసం తెలంగాణా రాష్ట్రంలో నాయకులు చూపిస్తున్న చొరవ నేడు కూటమి నేతలు చూపించడం లేదని ఎంతో దారుణంగా ఉందని విమర్శించారు. నీటి వాటాల్లో రెండు తెలుగురాష్ట్రాలకు సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు. అయితే మన ఏపీకి మాత్రం నీటిని ఎందుకు విడుదల చేయడంలోదో ప్రభుత్వం చెప్పాలన్నారు. వీటికి అంతటికి కారణం తెలంగాణ సీఎంతో ఏపీ సీఎం చేసుకున్న చీకటి ఇప్పందం అని తేటతెల్లం అయ్యిందన్నారు. జిల్లా కలెక్టర్ మాత్రం సాగునీరు ఉందని, త్రాగునీరు ఉందని చెబుతున్నారని, అయితే వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయనడానికి మిట్నాల కుంట సాక్షం అన్నారు. ఇటీవల ప్రధాన మంత్రి మన్కీ బాత్లో నంద్యాలకు త్రాగు నీరు, సాగునీరు ఇస్తున్నామని పొగిడారని ఇది నిజంగా ఉందో లేదో అధికారులు చెప్పాలన్నారు. కలెక్టర్ కార్యాలయానికి 10 కిలో మీటర్ ల దూరంలో ఉన్న మిట్నాల గ్రామానికి నీరు లేదన్నారు. ఈ గ్రామాన్ని అభివృద్ధి చేసింది మాత్రం మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి అని ప్రతి ఒక్కరు చెబుతున్నారని తెలిపారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసీపీ నాయకులు తిరుపతి రెడ్డి,రైతులు, వైసీపీ నాయకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# గుంతకల్లుగుంటూరు రైల్వే డబ్లింగ్, విద్యుదీకరణ పనులను వేగవంతం చేయాలి

**భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, ఆగస్టు 29(నంది పత్రిక):–** గుంతకల్లు గుంటూరు రైల్వే మార్గంలో చేపడుతున్న డబ్లింగ్ మరియు విద్యుదీకరణ పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి గుంతకల్లుగుంటూరు రైల్వే మార్గంలో చేపడుతున్న డబ్లింగ్ పై గుంతకల్ కన్స్ట్రక్షన్స్ .సీఈ సంతోష్ కుమార్, ఎస్ ఎస్ ఈ వర్క్స్ గుంతకల్ కన్స్ట్రక్షన్స్ ఆనంద్ కుమార్, ఎక్సన్ / కన్స్ట్రక్షన్స్ ధోన్ భగవాన్ దాస్ సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సుమారు 2 ఎకరాల 32 సెంట్ల భూమికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని తెలిపారు. గతంలో కోర్టు పరిధిలో ఉన్న కేసులకు సంబంధించి సంబంధిత అధికారులతో కలిసి ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. భూసేకరణకు సంబంధించిన అంశాలను వేగంగా పరిష్కరించి, రైల్వే డబ్లింగ్ మరియు విద్యుదీకరణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైల్వే ప్రాజెక్టు పూర్తయితే ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు ప్రయాణికులు, సరుకు రవాణాకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై సంబంధిత శాఖలు, రైల్వే అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు చేపడతామన్నారు.

# రేపు జరగబోయే నీట్ -పి జి పరీక్షకు పటిష్ట బందోబస్తు

**పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు.**
**ఉదయం 7 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారు.**
**అభ్యర్థులు ఉదయం 8.30 లోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.**
**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**
**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఈ నెల 30-08-2026 (ఆదివారం)న కర్నూలు జిల్లా వ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలలో ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నీట్ -పి జి పరీక్ష నిర్వహించనున్నట్లు కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ శనివారం తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 2,144 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

**7 పరీక్షా కేంద్రాలు... అవి.**

1) ఐయాన్ డిజిటల్ జోన్ - కర్నూలు. (పూజ్య ఎడ్యుకేషనల్ సొసైటీ, డా. కె.వి. సుబ్బారెడ్డి స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, దూపాడు, కల్లూరు మండలం)

2) డా.కె వి సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , దూపాడు రైల్వే స్టేషన్ - లక్ష్మీపురం పోస్ట్,

3) ఐయాన్ డిజిటల్ జోన్ - దూపాడు రైల్వే స్టేషన్ ఎదురుగా, లక్ష్మీపురం పోస్ట్,

4) జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్, నంద్యాల రోడ్ , కర్నూలు.

5) యునిడాడ్ టెక్నాలజీస్, సర్వీసెస్ నంద్యాల చెక్ పోస్టు, కర్నూలు.

6) భీమా ఇంజనీరింగ్ కాలేజ్, ఆలూరు రోడ్డు, ఆదోని.

7) సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కాలేజ్, ఎర్రకోట, ఎమ్మిగనూరు. నీట్ -పి జి పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు అన్ని నియమ నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పరీక్ష రాసి తమ లక్ష్యాలను చేరుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని ఎస్పీ తెలిపారు.పరీక్షా నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అభ్యర్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకుని , ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసి విజయవంతం కావాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటల్ ఐపియస్ ఆకాంక్షించారు.నీట్ పరీక్షల (పీజీ )-2026 నిర్వహణకు సంబంధించి కర్నూలు కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ / కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

విద్యార్థులకు ఏమైనా సలహాలు ఉంటే హెల్ప్ డెస్క్ ల్యాండ్‌లైన్ నంబర్: 08518 277305 ను సంప్రదించి, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.



# కాంట్రాక్ట్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ కే వెంకటేశ్వర్లు

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరసన నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు వారిని పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను సూపరింటెండెంట్ అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది వివరించిన సమస్యలను సంబంధిత పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఆసుపత్రి వైద్య సేవల్లో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులకు హాజరై తమ విధులను నిర్వర్తించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు సూచించారు.



# రహదారులపై ఆక్రమణలు సరికాదు

**ట్రాఫిక్ నియంత్రణకు, వాహనదారుల భద్రతకు సహకరించాలి**

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో రహదారులను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో పాటు వాహనదారుల భద్రతకు ముప్పు కలిగించడం ఏమాత్రం సబబు కాదని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. శనివారం బళ్లారి చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారి సర్వీస్ రహదారిపై ఆక్రమణలను తొలగింపజేశారు. రహదారిపై ఉంచిన టైర్లు, శాశ్వత నిర్మాణాలను వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఆక్రమణదారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో వాహనదారులకు ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు, రహదారులపై జరుగుతున్న ప్రమాదాలను వాణిజ్య దుకాణదారులు గ్రహించి, సామాజిక బాధ్యతగా ఆక్రమణలకు పాల్పడకుండా సహకరించాలని సూచించారు. ట్రాఫిక్ సజావుగా సాగేందుకు, వాహనదారులు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు రహదారులను ఆక్రమించకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎలాంటి రాజీ లేకుండా ఆక్రమణలను తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం విష్ణు టౌన్‌షిప్‌లో మురుగు కాలువలో తాగునీటి పైప్‌లైన్ మార్పు పనులు జరుగుతున్న ప్రదేశాన్ని, పందిపాడులో నూతన డ్రెయిన్‌ను పరిశీలించారు. నందికొట్కూరు రోడ్డులోని డిమార్ట్ సమీపంలో పిజిఆర్‌యస్ ఫిర్యాదు ప్రాంతాన్ని, ముజఫర్ నగర్ నూతన రైతు బజార్‌ను పరిశీలించి, డస్ట్ బిన్‌లు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సెట్కూర్ కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, జనార్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎంజల్ ప్రణీత, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

# గోరుకల్లు నుండి ఎస్ ఆర్ బి సి కి వారం రోజులు త్రాగునీరు... మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



**బనగానపల్లె ఆగష్టు 29నందిపత్రిక** గోరుకల్లు రిజర్వాయర్ నుండి ఎస్ ఆర్ బి సి కాల్వకు వారం రోజులపాటు త్రాగునీరు సరఫరా అవుతుందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. శనివారం క్యాంపు కార్యాలయం లో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఎండిన బోర్లవలన ఆయా గ్రామాల్లో బోర్లకు నిరందడంలేదని అయితే ఎస్ ఆర్ బి సి కాల్వల ద్వారా నీరు పారడం వల్ల భూగర్భ జలం పెరిగి బోర్లలో నీరు అందుతాయని, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రి కి సమస్యను వివరించగా వారు అంగీకరించారాని అందువల్ల ఒక వారం రోజులపాటు ఎస్ ఆర్ బి సి కి నీటి విడుదల జరుగుతుందని అయితే ఈ నీటిని రైతులెవ్వరు పైరు సాగుకు వాడవద్దని కేవలం త్రాగునీటికి వాడాలని చెప్పారు. ఇప్పటికే అవుకు రిజర్వాయర్ కు జి ఎన్ ఎస్ ఎస్ నుంచి నీళ్లు తీసుకు వెళుతున్నాం. అదే ఎస్ఆర్బిసి ద్వారా ఒక వారం పాటు తీసుకెళ్తే కాలువ వెంబడి ఉన్న వాగులు, వంకలతో పాటు గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి, బోర్లు తిరిగి రీఛార్జ్ అవుతాయని విషయం ప్రభుత్వానికి విన్నవించాం అని అన్నారు అయితే ఎస్ ఆర్ బీసీ ద్వారా నీళ్లు వస్తే రైతులు మళ్లీ పంటలు వేసి నష్టపోతారనే ఆందోళన ప్రభుత్వంలో ఉంది. ఈ నేపథ్యంలో పశువులు, తాగునీటి కోసం నీరు విడుదల చేస్తున్న విషయం ఇప్పటికే స్థానిక రైతులకు వివరించాం అన్నారు రేపు సాయంత్రం నుంచి ఒక వారం రోజులు పాటు ఎస్ఆర్బిసి ద్వారా నీటిని విడుదల చేయాలని నిర్ణయించాం దయచేసి రైతులు పంటలు వేసుకోవద్దని విన్నవించుకుంటున్నాం ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా దుర్భిక్ష పరిస్థితులు ఉన్నాయి వచ్చే కొద్దిపాటి నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది వారం రోజులు మాత్రమే నీరు వస్తుంది... ఈ విషయాన్ని గ్రహించి దయచేసి పంటలు వేసుకోకుండా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. స్థానికంగా క్షేత్రస్థాయిలో గ్రామాల పరిస్థితి చూసి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు ప్రభుత్వం రైతుల పట్ల సదుద్దేశంతో ఉంది.. గతంలో సైతం మే, జూన్ నెలలో కూడా రైతులు వద్దనే వరకు సాగునీరు అందించాం స్థానికంగా ప్రజలు రైతులకు ఇక్కడి సమస్యలపై అవగాహన ఉంది..కొంతమంది అనవసరంగా ఈ అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

# యువత మేలుకో.. ఓటరుగా నమోదు చేసుకో

**కర్నూలు అసెంబ్లీ యువతకు ఈఆర్వో, కమిషనర్ పిలుపు**

**ఆదివారం పోలింగ్ కేంద్రాల్లో 'స్పెషల్ క్యాంపెయిన్ డే'**

**ఫారం-6, 7, 8 ద్వారా ఓటర్ల జాబితాలో నమోదు, సవరణలకు అవకాశం**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** యువత మేలుకో.. ఓటరుగా నమోదు చేసుకో.. అనే పిలుపు మేరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న 'స్పెషల్ క్యాంపెయిన్ డే' కార్యక్రమాన్ని శనివారం ఏ.క్యాంపులోని ఇందిరాగాంధీ మెమోరియల్ స్కూల్లో ఈఆర్వో, పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, వివరాల సవరణ ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఫారం-6, అనర్హులైన లేదా మరణించిన, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన వారి పేర్లపై అభ్యంతరం లేదా తొలగింపు కోసం ఫారం-7, ఓటర్ల జాబితాలో పేరు, చిరునామా తదితర వివరాల్లో మార్పులు, సవరణలు చేసుకునేందుకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్ఐఆర్ డ్రాఫ్ట్‌లో ఓటు లేని వాళ్ళు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆదివారం నిర్వహించే 'స్పెషల్ క్యాంపెయిన్ డే'లో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని, అర్హత ఉన్న యువతతో పాటు ఓటర్ల జాబితాలో తమ పేర్లు, వివరాలను పరిశీలించుకోవాల్సిందిగా సూచించారు. 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని, అవసరమైన సవరణలు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.



# కడప నగర అధ్యక్షుడు లయన్ మన్సూర్ అలీ ఖాన్ గారి ఆధ్వర్యంలో ఘనంగా కడప ఎమ్మెల్యే మాధవి గారి జన్మదిన వేడుకలు , స్పోర్ట్స్ కిట్లు, చీరలు, బ్రెడ్ల పంపిణీ.



ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి గారి జన్మదినం సందర్భంగా కడప నగర అధ్యక్షుడు లయన్ మన్సూర్ అలీ ఖాన్ గారి ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి గారు, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాసరెడ్డి గారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, అభిమానుల కోలాహలం నడుమ ఎమ్మెల్యే మాధవి గారు భారీ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, మహిళలకు చీరలు మరియు ప్రజలకు బ్రెడ్ల పంపిణీ కార్యక్రమాన్ని వారు స్వయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్ మన్సూర్ అలీ ఖాన్ గారితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# సహాయక చర్యలపై సందిగ్ధత

జలప్రళయ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు సహకరిస్తామంటూ పలు దేశాలు ముందుకురాగా.. నేపాల్ ఆ అభ్యర్థనలను తొలుత తిరస్కరించింది. ఇప్పుడు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. విదేశీ సహాయక బృందాలను దేశంలోకి అనుమతించేందుకు అంగీకరించింది. తమ బృందాలు సహాయక చర్యలు నిర్వహించగలవని, విదేశీ బృందాలను అనుమతించబోమని ఇటీవల నేపాల్ వెల్లడించింది. అయితే గల్లంతయిన వారిలో పలు దేశాల ప్రజలు ఉన్నారు. దాంతో సహాయక చర్యల్లో భాగం అవుతామని ఆయా దేశాల నుంచి వచ్చిన దౌత్యపరమైన ఒత్తిడి కారణంగా చివరకు నేపాల్ ప్రభుత్వం.

# శ్రీ అనంత మంగళ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఆదోని పట్టణంలో శ్రీ అనంత మంగళ ఆంజనేయస్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించిన గజద్వారాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల ఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నూతనంగా నిర్మించిన గజద్వారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణమ్మ మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణులు అందరూ దృఢ సంకల్పంతో ముందుకు వచ్చి గజద్వారం నిర్మాణ పనులను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు. భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరినీ ఆమె అభినందించారు. అలాగే ప్రత్యేక పూజా కార్యక్రమాలు 28, 29, 30 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆంజనేయస్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, జిల్లా ప్రజలకు శాంతి, సౌభాగ్యాలు కలగాలని కృష్ణమ్మ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివ, ఉరుకుంద డైరెక్టర్ రంగస్వామి, అధ్యక్షులు ఎం .జి ఈరన్న ,వడ్డెమన్ గోపాల్ ,యస్ ఎం నాగరాజు, సత్య, గోవిందరాజులు, కపటి మాధవ,గుళ్యమరాజు, ఈరన్న, దేవేంద్ర, పెద్ద చిట్టి, భరత్ , చంద్ర,ఉపేంద్ర , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాల్లో భద్రత ఏర్పాట్లను పరిశీలించిన ... కర్నూలు ఎస్పీ

**ముఖ ద్వారం నుంచి రాఘవేంద్ర స్వామి మఠం వరకు ఏర్పాట్ల పరిశీలన.**

**ఆలయంలో అమ్మవారి దర్శనం.... అనంతరం నిఘా నేత్రాల పరిశీలన చేసిన ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఆగష్టు 27 నుండి సెప్టెంబర్ 2 వరకు కర్నూలు జిల్లా మంత్రాలయంలో కొలువైన శ్రీ రాఘవేంద్ర స్వామి 355 వ సప్తరాత్రోత్సవాలలో భాగంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ భద్రత ఏర్పాట్లను, ఆలయ పరిసరాలను శనివారం పరిశీలించారు. ఫాల్కన్ వాహనం , డ్రోన్ కెమెరాలు, బాడీ ఒన్ కెమెరాలు, సిసి కెమెరాల వంటి తదితర భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దాదాపు 300 మంది పోలీసు బలగాలతో ఉత్సవాలలో భద్రత ఏర్పాట్లను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం శ్రీమఠంలో క్యూ లైన్, దేవాలయ ప్రాకారం, తుంగ భద్ర నది తీర పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సప్తరాత్రోత్సవాల ఏర్పాట్ల గురించి మఠం సహాయ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి జిల్లా ఎస్పీకి వివరించారు. జిల్లా ఎస్పీ తో పాటు స్పెషల్ బ్రాంచ్ సిఐ మధుసుధన్ రావు , మంత్రాలయం సిఐ దస్తగిరి, సీఐ రామంజులు , శ్రీ మఠం అధికారులు ఉన్నారు.

# ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి రాఖీ కట్టిన తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ



**కర్నూల్ సిటీ నంది పత్రిక** రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ ఆత్మీయంగా కలిసి రాఖీ కట్టారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి కి రాఖీ కట్టి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు, సోదరభావం, ఆత్మీయత ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షించారు. రాఖీ పండుగ సందర్భంగా ఈ ఆత్మీయ కలయిక సోదరభావానికి, పరస్పర ఆప్యాయతకు ప్రతీకగా నిలిచింది.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం

**లయన్స్ క్లబ్ క్రీడా దినోత్సవ పురస్కారాలు అందుకున్న చెస్ కోచ్ రామ సుబ్బారెడ్డి, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు.**

**క్రీడలను స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థలు ప్రోత్సహించాలి: డాక్టర్ రవి కృష్ణ**

**నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 29 . (నంది పత్రిక ):** శనివారం హాకీ మాంత్రికుడు పద్మభూషణ్ ధ్యాన్ చంద్ జన్మదినోత్సవం పురస్కరించుకుని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు కన్నయ్య సౌజన్యంతో క్రీడలను ప్రోత్సహిస్తున్న ఇద్దరు కోచ్ లకు నంద్యాల లయన్స్ క్లబ్ జాతీయ క్రీడా దినోత్సవ పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. చెస్ కోచ్ గా,నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శిగా ఎంతోమంది చెస్ క్రీడాకారులను తయారుచేసిన రామ సుబ్బారెడ్డి, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ గా క్రీడలను ప్రోత్సహించడంలో విశిష్ట కృషి చేసిన శ్రీనివాసులు లకు అంతర్జాతీయ లయన్స్ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్,ఉమ్మడి కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ క్రీడలను ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, దాతలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు యువత క్రీడలలో పాల్గొనవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్రీడలు గెలుపోటములను స్వీకరించే మనస్తత్వం,ఓటమి చెందిన వారు తిరిగి విజయం కోసం ప్రయత్నించే స్వభావం, క్రమశిక్షణ,ఏకాగ్రత అలవాడతాయని అన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ యూత్ బ్యాచ్ సభ్యులు వచ్చే నెలలో నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ కు బహుమతుల కోసం 10 వేల రూపాయలు విరాళంగా ప్రకటించారు. ఈ కార్యక్రమం లో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్, మేడా చంద్రశేఖర్,జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు, సంయుక్త కార్యదర్శి అమిదేల జనార్ధన్,కార్యక్రమానికి సహకరించిన కన్నయ్య, సీనియర్ సభ్యులు ఎం.పీ.వి.రమణయ్య, తోట శ్రీనివాస్, వాసు పాల్గొన్నారు.




# గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి నేరుగా వినతులను స్వీకరించి పరిష్కరించిన కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

**కర్నూల్ సిటీ నంది పత్రిక** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల్ నారా చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు శనివారం కోడుమూరు నియోజక వర్గం శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి తన నివాసం నందు నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో నియోజకవర్గం నలుమూలల నుంచి విచ్చేసిన వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యక్షంగా అర్జీలు స్వీకరించారు అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లోనే మాట్లాడి కొన్ని సమస్యలకు తక్షణ పరిష్కారం అందించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# తెలుగు మాతృభాషా పరిరక్షణ మన అందరి బాధ్యత -శ్రీయం శ్రీనివాసమూర్తి







## వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి సేవలు చిరస్మరణీయం

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 29 ( నంది పత్రిక )** శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఆడిటోరియంలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు జరిగాయి. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు, ప్రముఖ భాషావేత్త గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవ వేడుకలను నంద్యాలలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా నంద్యాల పట్టణ ప్రముఖ అడ్వకేట్, సాహితీ స్రవంతి అధ్యక్షులు శ్రీ ఎం. శ్రీనివాసమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషను పండితుల భాషగా మాత్రమే కాకుండా సామాన్య ప్రజలకు సైతం సులభంగా అర్థమయ్యేలా వ్యవహారిక భాషగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేశారని అన్నారు. ఆయన ప్రారంభించిన వ్యవహారిక భాషోద్యమం తెలుగు భాషా చరిత్రలో ఒక గొప్ప మలుపుగా నిలిచిందన్నారు. ప్రపంచీకరణ ప్రభావంతో నేటి తల్లిదండ్రులు తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమంలో చదివించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని, ఫలితంగా మాతృభాషకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషలో విద్యాభ్యాసం వల్ల విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, భావ వ్యక్తీకరణ సామర్థ్యం మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

బ్రిటిష్ పాలన కాలంలో ప్రవేశపెట్టబడిన ఆంగ్ల విద్యా విధానం ప్రభావంతో భారతీయ భాషలు, స్థానిక సంస్కృతులు క్రమంగా నిర్లక్ష్యానికి గురయ్యాయని పేర్కొన్నారు. దాదాపు రెండు శతాబ్దాలుగా ఆంగ్ల మాధ్యమ విద్యకు అలవాటుపడిన మన సమాజం మాతృభాషల ప్రాధాన్యాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. “భిన్నత్వంలో ఏకత్వం, సహనం, పరస్పర గౌరవం వంటి భారతీయ విలువలు మన ప్రాంతీయ భాషలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలతో ముడిపడి ఉన్నాయి. మాతృభాషను కాపాడుకోవడం అంటే మన సంస్కృతిని, మన అస్తిత్వాన్ని కాపాడుకోవడమే” అని డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. విద్యార్థులు తెలుగు భాష సాహిత్యం పట్ల అభిరుచిని ఆసక్తిని కలిగి ఉండాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్య అతిథి ఎం. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషను ప్రజల భాషగా మార్చేందుకు చేసిన కృషి మరువలేనిదన్నారు. పండితులకే పరిమితమైన గ్రాంథిక భాషకు బదులుగా ప్రజలు నిత్యజీవితంలో మాట్లాడే వ్యవహారిక భాషను విద్య, సాహిత్యం, పరిపాలన రంగాల్లోకి తీసుకురావడానికి గిడుగు రామమూర్తి చేసిన పోరాటం చారిత్రాత్మకమన్నారు.

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మాతృభాషపై ప్రతి ఒక్కరూ అభిమానం, గౌరవం పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో తెలుగు భాషకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, తెలుగు సాహిత్యాన్ని చదవడం ద్వారా భాషపై పట్టు సాధించాలని అన్నారు. విద్యార్థులు కళాశాల స్థాయి వరకు మాతృభాషలో విద్యను అభ్యసించే అవకాశాలు మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు భాష కేవలం సంభాషణకు మాత్రమే పరిమితమైనది కాదని, వేల సంవత్సరాల సాహిత్య సంపద, సంస్కృతి, చరిత్ర, కళలను తనలో ఇముడ్చుకున్న గొప్ప భాష అని ఆయన పేర్కొన్నారు. యువత తెలుగు భాషను సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేసి, ఆధునిక తరాలకు చేరువ చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాష ప్రాధాన్యత, గిడుగు రామమూర్తి పంతులు చేసిన సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తెలుగు భాషా పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ తెలుగు అధ్యాపకులు నీలకంఠం ఆచారి గిడుగు రామ్మూర్తి పంతులు గారిపై చక్కటి కవితను చదివి వినిపించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులను కళాశాల యాజమాన్యం శాలువా మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. జాతీయ గీతంతో కార్యక్రమం ముగిసింది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ లలితా సరస్వతి, ఎం మోహనరావు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. తెలుగు భాషను పరిరక్షించి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.




# శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఘనంగా “జాతీయ క్రీడా దినోత్సవం“ వేడుకలు







**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 29 ( నంది పత్రిక )** శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో శనివారం “జాతీయ క్రీడా దినోత్సవం“ కార్యక్రమాన్ని కళాశాల యాజమాన్యం ఎంతో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి డైరెక్టర్ డా. జి. హేమంత్ రెడ్డి , ప్రిన్సిపల్ డా. కె.వి.వి. సుబ్బయ్య , డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ఏ.ఎస్. ప్రగతి , ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం. ఇంతియాజ్ అహ్మద్ , అతిథులు కలశాల ఫిజికల్ డైరెక్టర్ ఎ. విజయ్ కుమారీ, డా. వంశీధర్ రెడ్డి గారు, లీనా, డా. శివారెడ్డి , అధ్యాపకులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు క్రీడలలో తమ అనుభవాలను, అభిప్రాయాలను సంతోషంగా పంచుకోవడంతో కార్యక్రమం ప్రారంభమైంది. అధ్యాపకురాలు శ్రావణి మాట్లాడుతూ, విద్యార్థులు పెద్ద ఎత్తున క్రీడలలో పాల్గొనడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. గత ఒక నెల రోజులుగా స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ఈ పోటీలను ఎంతో పారదర్శకంగా నిర్వహించిందని, డైరెక్టర్ డా. జి. హేమంత్ రెడ్డి పర్యవేక్షణలో అన్ని విభాగాల విద్యార్థులను సమానంగా ప్రోత్సహించారని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వి.విజయ కుమారి మాట్లాడుతూ, హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని మనం జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు తమ శారీరక, మానసిక వికాసాన్ని పెంపొందించుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ఏ.ఎస్. ప్రగతి గారు మాట్లాడుతూ, పోటీలలో గెలుపోటముల కంటే పాల్గొనడమే ముఖ్యమని పేర్కొన్నారు. క్రీడలు జీవితానికి అవసరమైన క్రమశిక్షణ, నిబద్ధత మరియు ఓటమిని స్వీకరించే మానసిక పరిపక్వతను నేర్పుతాయని, నేటి తరం మొబైల్ వాడకాన్ని తగ్గించి శారీరక దృఢత్వంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం. ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా నాయకత్వ లక్షణాలు , సమష్టి కృషితో పనిచేసే తత్వం , ఒత్తిడిని అధిగమించే నైపుణ్యాలను పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కార్పొరేట్ సంస్థలు కేవలం అకడమిక్ ప్రతిభనే కాకుండా క్రీడల ద్వారా అలవడే వ్యక్తిత్వ వికాసాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఉద్యోగ నియామకాలలో ప్రత్యేకంగా గుర్తిస్తున్నాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోనూ చురుగ్గా పాల్గొని కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డా. జి. హేమంత్ రెడ్డి మాట్లాడుతూ, నేడు ఎక్కువమంది మొబైల్స్, టీవీలకే పరిమితమవుతున్నారని, ప్రతిరోజూ మైదానంలో ఆడే అలవాటు చేసుకోవాలని సూచించారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని తదుపరి మ్యాచ్‌కు సిద్ధం కావడమే నిజమైన ‘స్పోర్ట్స్ మ్యాన్ స్పిరిట్’ అని పేర్కొన్నారు. ఆగస్టు 29 క్రీడా వేడుకలు నిర్వహించుకోవడానికి ఎంతో పవిత్రమైన రోజని, ప్రతి ఆటకు కేటాయించిన పాయింట్ల ఆధారంగా ఛాంపియన్‌ను నిర్ణయిస్తామని తెలిపారు. ఈ రన్నింగ్ ట్రోఫీని వరుసగా మూడు సార్లు గెలుచుకున్న జట్టుకే అది శాశ్వతంగా సొంతమవుతుందని వెల్లడించారు. డా. శివారెడ్డి మాట్లాడుతూ, కళాశాలలో క్రీడలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, ఈ కళాశాల క్రీడల్లో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని ప్రశంసించారు.

కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడలలోనూ ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. క్రీడారంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే ఉద్యోగావకాశాలు సులభంగా లభిస్తాయని పేర్కొన్నారు. గతంలో తమ కళాశాల సౌత్ జోన్ షటిల్ పోటీలలో మూడు సార్లు విజేతగా నిలిచిందని, కళాశాలకు చెందిన ఓ క్రీడాకారిణి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి ఇండియన్ రైల్వేస్‌లో ఉద్యోగం సాధించిందని గుర్తుచేశారు. తక్కువ పోటీ ఉన్న క్రీడలను సైతం ఎంచుకుని నైపుణ్యం సాధిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.

**.విజేతలు మరియు వివరాలు**

లగోరి

అమ్మాయిలు

ప్రథమ బహుమతి బి సి ఎ సెకండ్ ఇయర్

ద్వితీయ బహుమతి బి. కం ఫైనల్ ఇయర్

తృతీయ బహుమతి బి బి ఏ ఫైనలియర్

అబ్బాయిలు నాగ శ్రీమంతు బి. సి. ఎ సెకండ్ ఇయర్

ద్వితీయ బహుమతి బి .బి. ఎ ఫైనలియర్

తృతీయ బహుమతి బి. బి . ఎ సెకండియర్

కబడ్డీ అమ్మాయిలు ప్రథమ బహుమతి బిసిఏ సెకండియర్ ద్వితీయ బహుమతి బిఎస్సి సెకండియర్

తృతీయ బహుమతి బీబీఏ ఫైనల్ ఇయర్

అబ్బాయిలు ప్రథమ బహుమతి బిఎస్సి ఫైనల్ ఇయర్ యూజీ క్యాంపస్

ద్వితీయ బహుమతి బీసీఏ సెకండియర్

తృతీయ బహుమతి బి బి ఏ ఫైనలియర్స్

క్యారమ్స్

ప్రథమ బహుమతి బి బి ఏ ఫైనల్ ఇయర్

ద్వితీయ బహుమతి బి సి ఏ సెకండ్ ఇయర్

తృతీయ బహుమతి బీఎస్సీ ఫైనల్ ఇయర్

అబ్బాయిలు

ప్రథమ బహుమతి బిబిఎ ఫైనల్ ఇయర్

ద్వితీయ బహుమతి బిఎస్సి సెకండియర్ యూజీ క్యాంపస్

తృతీయ బహుమతి బీకాం ఫైనల్ ఇయర్

షటిల్ బ్యాట్మెంటన్

అమ్మాయిలు

ప్రథమ బహుమతి బి బి ఏ సెకండ్ ఇయర్

ద్వితీయ బహుమతి బీకాం సెకండ్ ఇయర్

తృతీయ బహుమతి బిఎస్సి ఫైనల్ ఇయర్

అబ్బాయిలు

ప్రథమ బహుమతి బీఎస్సీ ఫైనల్ ఇయర్

ద్వితీయ బహుమతి బిసి ఫైనల్ ఇయర్

తృతీయ బహుమతి బి బి ఏ ఫైనల్ ఇయర్

త్రోబల్ అమ్మాయిలకు

ప్రథమ బహుమతి బి సి ఎ సెకండ్ ఇయర్

ద్వితీయ బహుమతి బిఎస్సి సెకండ్ ఇయర్

తృతీయ బహుమతి బిసి ఫైనలియర్

వాలీబాల్ అబ్బాయిలకు

ప్రథమ బహుమతి బి సి ఎ ఫైనల్ ఇయర్

ద్వితీయ బహుమతి బిబిఎ సెకండ్ ఇయర్

తృతీయ బహుమతి బిఎస్సి సెకండ్ ఇయర్

చెస్ అబ్బాయిలు ప్రథమ బహుమతి బి సి ఎ ఫైనలియర్

ద్వితీయ బహుమతి బిబిఎ సెకండ్ ఇయర్

తృతీయ బహుమతి బీసీఏ సెకండియర్.

క్రికెట్ ప్రథమ బహుమతి బీకాం ఫైనల్ ఇయర్ యూజీ క్యాంపస్ ద్వితీయ బహుమతి బి బి ఏ ఫైనల్ ఇయర్

తృతీయ బహుమతి బి బి ఏ సెకండ్ ఇయర్

18 టీములు పాల్గొనగా 12 టీమ్స్ కి పాయింట్స్ లభించాయి అన్ని పాయింట్లను కలుపుకొని బీసీఏ సెకండియర్స్ నీ విజేతగా ప్రకటించారు. బీసీఏ విద్యార్థులకు హేమంత్ రెడ్డి గారు ట్రోఫీని అందజేశారు. ఇంతటితో ఈ కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా ముగించారు.

## శ్రీ మద్దులేటీ స్వామి దేవాలయ అభివృద్ధి కొరకు భక్తుడు 1 లక్ష 116 రూ.లు విరాళం.



**బేతంచెర్ల ఆగస్టు 29 (నందిపత్రిక ).** నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్. రంగాపురం గ్రామ పరిధిలో వెలసిన ప్రముఖ వైష్ణవ క్షేత్రం, లక్షాలది భక్తుల ఆరాధ్య దైవం శ్రీమద్దులేటి నరసింహ స్వామి మరియు శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారు వెలసి ఉన్న దేవస్థానం అభివృద్ధి కొరకు శనివారం నాడు నంద్యాల జిల్లా నంది కోట్కూరు మండలం బ్రాహ్మణ కోట్కూరు గ్రామానికి చెందిన ఎన్. చిన్నయ్య దేవస్థానం అభివృద్ధి కొరకు ఒక లక్ష 116 రూపాయలు విరాళాంగా సమర్పించారని ఉప కమీషనర్ & దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజనేయులు తెలిపారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలదే కీలక పాత్ర - ఎస్ ఐ జయశేఖర్



**కొత్తపల్లి – నంది పత్రిక :** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలదే కీలక పాత్ర అని ఎస్ ఐ జయ శేఖర్ అన్నారు. శనివారం రాత్రి ఎదురుపాడు గ్రామంలో సీసీ కెమెరాలు పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోజురోజుకూ సీసీ కెమెరాల ప్రాధాన్యత పెరుగుతున్నది. గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజలకు భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. దొంగతనాలు నిర్మూలించుటకు, వాస్తవాలు తెలుసుకోవడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రామీణ ప్రాంతాలలో ప్రతి వీధిలో సీసీ కెమెరాలు ఉండటం వల్ల ప్రజల భద్రతకు భరోసా ఉంటుందన్నారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడవద్దన్నారు. వాహనదారులు, ప్రయాణికులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ ప్రజలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రములను అందుకున్న గుండా గోపాల్ - మాధవి-సురేంద్ర.







**బేతంచెర్ల ఆగస్టు 29 (నందిపత్రిక ).** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా,బేతంచెర్ల సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రక్త దానం పై అవగాహన మరియు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వ హించి నందుకు గాను, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ దస్తగిరి ఆధ్వర్యంలో, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా చేతుల మీదుగా, రోటరీ క్లబ్ సీనియర్ అధ్యక్షులు గుండా గోపాల్,ఓం శాంతి నిర్వాహకురాలు బ్రహ్మ కుమారీ మాధవి రెడ్ క్రాస్ సొసైటి జిల్లా మెంబర్ సురేంద్ర గౌడ్ కు సేవా ప్రశంసా పత్రాలను శనివారం నాడు, జిల్లా కలెక్టర్ చాంబర్ లో అంద జేయడం జరిగింది. ఈ సందర్బంగా ప్రశంసా పత్రాలు అందుకున్న గ్రహితలు,కలెక్టర్ రాజకుమారి గణియాకు కృతజ్ఞతలు తెలియ జేశారు.



## నంగునూర్‌లో పూజల హరికృష్ణ జన్మదిన వేడుకలు



**నంగునూర్, ఆగస్టు 29,** సిద్ధిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ జన్మదిన వేడుకలు నంగునూర్ మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. నంగునూరు మండలం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. బాణాసంచా పేల్చారు. పూజల హరికృష్ణకు నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి పూజల హరికృష్ణ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రజల కోసం మరింతగా సేవలందించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీస్సులతో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాపోల్ రాజహుదూర్ రెడ్డి, ఎండీ. ఇమ్రాన్, కర్ణకంటి. రవీంద్ర చారి, సర్పంచులు రాధాకృష్ణ, మైపాల్ రెడ్డి, రంగు. అశోక్, రంగారెడ్డి, రాజేశ్వర్, శ్రీనివాస్ రెడ్డి, జీవన్ నాయక్, ప్రభాకర్, సామ్ రెడ్డి, సంతోష్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కాటన్ కనకయ్య, చిన్న అజ్మత్,వెంకటేష్, రమేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రాణాలు కాపాడి అమరుడైన పోలీస్

నేపాల్–చైనా సరిహద్దులో బుధవారం సంభవించిన మెరుపు వరదలు పెను విధ్వంసం సృష్టించాయి. ఈ విపత్తు నుంచి పలువురిని రక్షించిన ఓ పోలీసు.. చివరికి ఆ వరదల్లోనే కొట్టుకుపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. వరద బీభత్స సమయంలో టిబెట్‌లోని గీరాంగ్ పోర్టు వద్ద సహాయక చర్యల్లో చైనా బోర్డర్ పోలీసు హువాంగ్ పెంగ్ పాల్గొన్నాడు. అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు పలువురికి సహకరించాడు. ఆ తర్వాత అదే జలప్రళయంలో కొట్టుకుపోయాడు. గీరాంగ్ పోర్టు వద్ద వరద దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. వరదకు ముందు అక్కడి నుంచి తాము సురక్షితంగా బయటపడడానికి బోర్డర్ కాప్ సహాయం చేశారని.. తమను కాపాడి, ఆయన ప్రాణాలు వదిలారని పలువురు వ్యక్తులు సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులను అందజేసిన

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ.





**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 30 నంది పత్రిక** హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాంచంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లాలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో, జిల్లా నుండి క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలకు "స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ - 2026" పురస్కారాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ ల చేతుల మీదుగా అందజేశారు. ఈ అవార్డులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు వ్యాయామ ఉపాధ్యాయులు కలెక్టర్ నుండి అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, జిల్లా విద్యాశాఖ మరియు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీ పరిశీలన ద్వారా అత్యధిక పాయింట్లు సాధించిన పాఠశాలలను ఈ అవార్డులకు ఎంపిక చేయడం జరిగిందని, ఈ అవార్డుల ఎంపికలో తణుకు మండలానికి చెందిన జడ్పీహెచ్ఎస్ మండపాక పాఠశాల 226 పాయింట్లతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ఆమె తెలిపారు. అలాగే పాలకోడేరు మండలానికి చెందిన జడ్పీహెచ్ఎస్ శృంగవృక్షం పాఠశాల 111 పాయింట్లతో ద్వితీయ స్థానాన్ని, భీమవరం మండలానికి చెందిన ఎస్.సి.హెచ్.బి.ఆర్.ఎం. హైస్కూల్ 90 పాయింట్లతో తృతీయ స్థానాన్ని కైవసం చేస్తుందన్నారు. వీటితో పాటు పాలకోడేరు మండలానికి చెందిన ఎస్.జె. జడ్పీహెచ్ఎస్ గొరగనమూడి పాఠశాల 76 పాయింట్లతో, వీరవాసరం మండలానికి చెందిన జడ్పీహెచ్ఎస్ తోలేరు పాఠశాల 49 పాయింట్లతో టాప్-5లో నిలిచి ఈ ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకున్నాయని ఆమె వివరించారు. విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి, శారీరక స్థిరత్వంకు క్రీడలు ఎంతో దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసి, వారిని రాష్ట్ర మరియు జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. అవార్డులు సాధించిన పాఠశాలల సిబ్బందిని, విద్యార్థులను ఆయన ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఓ.వి.ఎస్. అనిల్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఈ నారాయణ, తదితర విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

## జిల్లాలో మహిళలు, బాలల సంరక్షణ సేవల బలోపేతానికి ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహణ.....

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.



**భీమవరం బ్యూరో ఆగస్టు 30 నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు పోస్టుల భర్తీకి శనివారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పాల్గొని అభ్యర్థుల ప్రతిభను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మొత్తం ఏడు పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు జరిగిందని ఆమె తెలిపారు. వీటిలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌లో ఒక సోషల్ వర్కర్ పోస్టు, స్పెషలైజేడ్ అడాప్షన్ ఏజెన్సీస్‌లో ఒక సోషల్ వర్కర్, ఒక ఆయా పోస్టుతో పాటు, వన్ స్టాప్ సెంటర్ తణుకులో సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్, పారాలీగల్ పర్సనల్, పారామెడికల్ పర్సనల్, కంప్యూటర్ పరిజ్ఞానంతో కూడిన ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయని వివరించారు. ఈ ఉద్యోగాలకు సంబంధించి మొత్తం 33 మంది అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయగా, వారిలో ఈ ఇంటర్వ్యూలకు 27 మంది అభ్యర్థులు హాజరయ్యారని, మిగిలిన ఆరుగురు అభ్యర్థులు ఈ ప్రక్రియకు గైర్హాజరైనట్లు ఆమె వెల్లడించారు. మహిళలు, పిల్లల సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఈ పోస్టులకు ఎంపికయ్యే సిబ్బంది కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, అందుకే అర్హత, సేవాభావం ఉన్న వారినే నిబంధనల ప్రకారం ఎంపిక చేస్తామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్వ్యూ కమిటీ సభ్యులు డిఆర్ఓ పి గ్లోరియా, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి డి శ్రీ లక్ష్మీ, డిఎస్పి రఘువీర్ విష్ణు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అరుణకుమారి, బాలల సంరక్షణ అధికారి ఆర్ రాజేష్, జోవనల్ జస్టిస్ బోర్డ్ మెంబర్ ఎం సురేష్ కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ పి వెంకటేశ్వరరావు, డిఎంహెచ్వో కార్యాలయ ఏవో డాక్టర్ ఎన్ బాల సృజన తదితరులు ఉన్నారు.



## ఆగష్టు 31 సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం తాత్కాలికంగా రద్దు



**భీమవరం బ్యూరో చీఫ్ ఆగస్టు 29 నందిపత్రిక** జిల్లా కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని ఆగష్టు 31 వ తేదీ సోమవారం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం, మొగల్తూరు పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం మొత్తం పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమై ఉండటంతో జిల్లా, డివిజన్ మరియు మండల స్థాయిలలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## నేపాల్‌లో సవాల్‌గా సహాయక చర్యలు !

నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఇప్పుడా చిన్న దేశం కోలుకోవడానికి సవత్సరాలు పట్టవచ్చు. ఊళ్లకు ఊళ్లు ధ్వంసం కావడంతో మళ్లీ పునర్నిర్మాణం అతిపెద్ద సమస్యగా మారింది. కేవలం టూరిజం ప్రధాన వనరుగా ఉన్న నేపాల్ ఆర్థికంగా పెద్దగా బలపడడ్ దేశం కాదు. మౌళిక వసతులు అంతంత మాత్రమే. ఈ క్రమంలో తొలుతు బురద తొలగింపు, గల్లంతయిన వారి గుర్తింపు ప్రధాన సమస్యగా మారింది. వరదల కారణంగా మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. అయితే మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. నేపాల్ పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక పక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫింగర్ ప్రింట్, డిఎన్ఎ నమూనాల సేకరణ ముఖం ద్వారా గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, ఇతర నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాల ను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగ పడతాయి. బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా నిల్వ ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్ఎ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాల నిర్వహణ కోసం నేపాల్‌లో 2021 ప్రత్యేక చట్టం అమల్లో ఉన్నాయి. జిల్లా పోలీస్ చీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలు గుర్తు తెలియని, బంధువులు ఎవరూ కలెయిమ్ చేయని మృతదేహాలను నిర్వహిస్తాయి. అయితే ప్రస్తుతం వరుసగా మృతదేహాలు వస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా స్థాయి కమిటీలు కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాయి. వరదల్లో గల్లంతైన 2,500 మందికి పైగా వ్యక్తుల కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రస్తుతం అధికారికంగా మృతుల సంఖ్య 616కి

చేరినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు వెలికితీయడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా మారడంతో నేపాల్ విదేశీ సహాయాన్ని స్వీకరించేందుకు అంగీకరించింది. ముఖ్యంగా భారత్, చైనాకు చెందిన సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలు స్థానిక అధికారులకు సహాయం చేసేందుకు అనుమతిస్తున్నారు. అంతర్జాతీయ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి, గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో పరిమిత సంఖ్యలో నిపుణులను, సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను నిర్దిష్ట ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం తెలిపింది. భారీ వరదల కారణంగా ప్రాణనష్టం మాత్రమే కాకుండా, మృతదేహాల గుర్తింపు, భద్రపరచడం, కుటుంబ సభ్యులకు అప్పగించడం వంటి పక్రియలు కూడా అధికారులకు పెద్ద సవాలుగా మారాయి. 600కు పైగా మరణాలు, 2,500 మందికి పైగా గల్లంతు, మార్చురీల పరిమిత సామర్థ్యం నేపాల్‌లో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల గుర్తింపు, కుటుంబాల పునరేకీకరణ ఇప్పుడు అధికారులకు అత్యంత కీలకమైన పనిగా మారింది.

## నేపాల్ వరదల్లో మరో విషాదం

నేపాల్‌లో బీభత్సం సృష్టించిన ఆకస్మిక వరదల్లో ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ సీఈఓ లక్ష్మీనాథ్ గోపిశెట్టి ఆచూకీ గల్లంతైంది. ఆయన వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్‌కు వెళ్లినట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయని, ఆచూకీ కోసం సంబంధిత అధికారులతో కలిసి గాలిస్తున్నామని తెలిపింది. గోపిశెట్టి కుటుంబ సభ్యులతో సంస్థ సంప్రదింపులు జరుపుతూ, వారికి అవసరమైన సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. కాగా.. నేపాల్-చైనా సరిహద్దు ప్రాంతంలో ఈ నెల 26న సంభవించిన జల ప్రళయంలో పలు రహదారులు, వంతెనలు, భవనాలు కొట్టుకుపోయాయి. ముఖ్యంగా నేపాల్‌లోని రసువా జిల్లా, చైనాలోని టిబెట్ ప్రాంతాల్లో భారీ నష్టం వాటిల్లింది. సహాయక చర్యలకు ప్రతికూల వాతావరణం, దెబ్బతిన్న రవాణా, సమాచార వ్యవస్థలు సవాలుగా మారాయి. ఈ విపత్తు కారణంగా వందలాది మంది భారతీయుల ఆచూకీ గల్లంతైనట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. సుమారు 320 మంది భారతీయులు ఇంకా అందుబాటులోకి రాలేదని వెల్లడించింది. అటు చైనాలో సుమారు 400 మంది భారతీయులు చిక్కుకున్నప్పటికీ సురక్షితంగా ఉన్నారంది. ఆయా కుటుంబ సభ్యులు వారితో కాంటాక్ట్‌లో ఉన్నారని తెలిపింది. చైనా వైపు చిక్కుకున్న వారిలో కొంతమంది ఇప్పటికే నేపాల్‌కు చేరుకున్నారు. తమిళనాడుకు చెందిన 21 మంది భారతీయులు కూడా సురక్షితంగా ఢిల్లీ చేరుకున్నారు. నేపాల్‌లో సహాయక చర్యలు కొనసాగుతుండగా, గల్లంతైన భారతీయుల ఆచూకీ కోసం భారత దౌత్య అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గోపిశెట్టి ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్‌కు నాయకత్వం వహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహరచన, సాంకేతికత, కార్యకలాపాలు, డిజిటల్ పరివర్తనలో సలహాదారుడిగా వ్యవహరిస్తున్నారు.

## కేశ:ఖండన కార్యక్రమంలో పాల్గొన్న... చల్లా శ్రీలక్ష్మీ..



**బేతంచెర్ల ఆగస్టు 29 ( నందిపత్రిక ).** నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దులేటి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నందు, అవుకు గ్రామానికి చెందిన మెట్టుపల్లె సుమిత్ర - శ్రీ మెట్టుపల్లె బాలకృష్ణ పుత్రుడు & పుత్రిక,ల కేశ:ఖండన ఆహ్వానం మేరకు శనివారం స్వర్గీయ ఎమ్మెల్సీ చల్లా భగీరథ రెడ్డి సతీమణి చల్లా శ్రీలక్ష్మి హాజరవడం జరిగింది.. ముందుగా శ్రీ మద్దిలేటిస్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని,స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించడమైనది.అనంతరం కేశ:ఖండనము జరుపుకుంటున్న చిన్నారులు, మేధాన్స్ & గీతాశ్రీ, లను దీవించి ఆశీర్వదించడం జరిగింది. అనంతరం బాలకృష్ణ కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడి, వారి అతిధి మర్యాదలు స్వీకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో చల్లా రాజ్యాభిషేక రెడ్డి, చల్లా జూ"ని రామకృష్ణారెడ్డి, చల్లా శ్రీలక్ష్మి అనుచరులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైభవంగా 'తెలుగు భాషా, క్రీడా దినోత్సవాలు'



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 30 నంది పత్రిక** తెలుగు భాషా దినోత్సవం మరియు జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేడుకలను ఘనంగా నర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధిలో, విద్యార్థుల పురోగతిలో విశేష సేవలు అందిస్తున్న ఫిజికల్ డైరెక్టర్ రాణమ్మ మేడం గారిని, తెలుగు ఉపాధ్యాయులైన నీరజ మేడం, వెంకట రమేష్ సార్, సూర్యనారాయణ రెడ్డి సార్ మరియు మీనా మేడం గార్లను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు.అభినందించారపాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. వీర రాఘవయ్య గారు మాట్లాడుతూ "మాతృభాష అయిన తెలుగును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, అలాగే క్రీడలు మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడతాయని" పేర్కొన్నారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ, క్రీడల్లోనూ, భాషా ప్రావీణ్యంలోనూ రాణించేలా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు అరుణ మేడం, సుజాత మేడం, షరీఫ్ సార్‌తో పాటు ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.



## రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరో చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి





**నరసాపురం, బ్యూరో చీఫ్ ఆగస్టు 30నంది పత్రిక** .రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారు లను ఆదేశించారు. శనివారం నరసాపురం నియోజకవర్గంలోని నరసాపురం, మొగల్తూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ నాగరాణి మరియు జిల్లాఎస్.పి అద్వాన్ నహీం అస్మి, పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీన నరసాపురం నియోజకవర్గంలో నరసాపురం పట్టణంలో పేదల సేవలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. అనంతరం మొగల్తూరు గ్రామం లో ప్రజా వేదికలో పాల్గొంటారన్నారు. మొగల్తూరులో ముఖ్యమంత్రి రావడానికి అనుకూ లంగా హెలి ప్యాడ్ ను ఏర్పాటు చేయ వలసిందిగా అధికా రులకు చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన పనులను రేపు సాయంత్రం లోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్, రాష్ట్ర కాపు కార్పొరే షన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, నరసాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి దాశి రాజు తదితరులు పాల్గొన్నారు.



# బాల్య వివాహాలు నిర్మూలన మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులకు అవగాహన

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని కూలీ లైన్ జెడ్పీ హైస్కూల్ లో శనివారం విద్యార్థులకు బాల్య వివాహాలు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు చెందిన నల్సా ఆశ న్యాయ సహాయ యూనిట్ ప్యానల్ అడ్వకేట్లు గాజుల రామ మూర్తి, షాజహాన్ పర్వీన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గాజుల రామ మూర్తి మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, బాల్య వివాహాల వల్ల విద్యకు దూరమవడంతో పాటు శారీరక, మానసిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. బాల్య



వివాహాల నిరోధక చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. షాజహాన్ పర్వీన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, విద్యార్థుల ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవితం భవిష్యత్తుపై వాటి ప్రభావాన్ని వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చెడు స్నేహాలకు లోనుకాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు తమ హక్కులు, చట్టపరమైన రక్షణలు న్యాయ సహాయ సేవల గురించి తెలుసుకోవడం ఎంతో అవసరమని న్యాయవాదులు పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మెండు రాజమల్లు, పెసరమిల్లి నాగేశ్వర రావు, పారా లీగల్ వాలంటరి,షానాజ్ బేగం, స్కూల్ హెడ్మాస్టర్ లాలు, టీచర్ దేవీలాల్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

# వేములవాడలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

క్రీడలను ప్రోత్సహించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా వేములవాడలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. సెప్టెంబర్ 26 నుంచి 29 వరకు అండర్ 20 బాలుర, అండర్ 16 బాలికల విభాగంలో నాలుగు రోజుల పాటు కబడ్డీ పోటీలు జరగనున్నట్లు వెల్లడించారు.శనివారం వేములవాడ పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాలతో పాటు హైదరాబాద్‌ను రెండు జట్లుగా పరిగణించి మొత్తం 34 బాలుర, 34 బాలికల జట్లు పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. ఒక్కో జట్టులో 14 మంది క్రీడాకారులతో పాటు ఇద్దరు అధికారులను కలుపుకొని సుమారు 1,358 మంది ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటారని చెప్పారు...ఇప్పటికే వేములవాడలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను విజయవంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో కబడ్డీ పోటీలను కూడా పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతి, భోజన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఎలాంటి



ఇబ్బందులు లేకుండా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేజ్, గ్రౌండ్, భోజన, వసతి, ప్రోటోకాల్ తదితర కమిటీలను ఏర్పాటు చేసి జిల్లా కబడ్డీ అసోసియేషన్, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.యువత క్రీడల వైపు మళ్లేలా ప్రోత్సహించడంతో పాటు, గ్రామీణ క్రీడల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి జాతీయ స్థాయికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతో పాటు సీఎం కప్ ద్వారా గ్రామీణ, మండల, జిల్లా స్థాయిలో వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు.కబడ్డీ పోటీలకు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీహరితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులను ఆహ్వానించినట్లు తెలిపారు. క్రీడల ద్వారా యువత శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు చెడు వ్యసనాలకు దూరంగా ఉండే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.గతంలో వేములవాడ ప్రాంతంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ వంటి గ్రామీణ క్రీడలకు మంచి ఆదరణ ఉండేదని, వాటిని మరింత ప్రోత్సహించేందుకు క్రీడా ప్రేమికులు ముందుకు రావాలని ఆది శ్రీనివాస్ కోరారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడా సంఘాలు, క్రీడాభిమానులు, మీడియా ప్రతినిధులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.వేములవాడలో నాలుగు రోజుల పాటు సుమారు 1,358 మంది క్రీడాకారులు, కోచ్‌లు, పీఈటీలు, పీడీలు పాల్గొనడంతో పట్టణంలో క్రీడా పండుగ వాతావరణం నెలకొంటుందని ఆయన అన్నారు. ఈ పోటీలను విజయవంతం చేసి వేములవాడకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

కామారెడ్డి నియోజకవర్గం దోమకొండ మండల కేంద్రంలోనిరెడ్డి సంఘం ఫంక్షన్ హాల్లో నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ , జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కర్ ముఖ్య అతిథులుగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందించాలనే లక్ష్యంతో స్మార్ట్ రేషన్ కార్డుల జారీ ప్రక్రియ చేపట్టాం. ఈ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులు సులభంగా అందడంతో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు అర్హత పొందే అవకాశం కలుగుతుంది.అని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమ కార్యక్రమాలు, మహిళా సాధికారత పథకాలు, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అనేక అభివృద్ధి



కార్యక్రమాలను అమలు చేస్తోంది. పేదల ముఖంలో చిరునవ్వు చూడడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రోడ్లు, విద్య, వైద్యం, సాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.అని షబ్బీర్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ గారు మాట్లాడుతూ. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోంది. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. అని అన్నారు. కేంద్రం మరియు రాష్ట్ర స్థాయిలో ప్రజలకు ఉపయోగపడే పథకాలను సమన్వయంతో అమలు చేయడానికి కృషి చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది.అని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఐరేని నర్సయ్య, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మండల అధ్యక్షులు ఆశబోయిన శ్రీనివాస్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజ్, ఎస్టి సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, మాజీ జడ్పీటీసీ తిరుమల్ గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వినీత్, గ్రామ అధ్యక్షులు మధు, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, అబ్రబోయిన స్వామి, గోపాల్ రెడ్డి, సిద్దారంలు, ఈశ్వర్ గౌడ్, లింగం, సాయిలు, కవిత, శ్రీహరి, నరేష్ రెడ్డి, శంకర్ రెడ్డి, సంజీవ్, రామస్వామి గౌడ్, సిద్ధారెడ్డి, బాపురెడ్డి, అంజం, జగ్గారెడ్డి, ముత్తాగౌడ్, నర్సింలు, బాలరాజ్, పాత్రికేయ మిత్రులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 6 గ్యారంటీలు 420 హామీలు 1000 రోజుల్లో అమలు కావడం లేదు బీఆర్ఎస్ ధ్వజం

జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జగిత్యాల నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ ఛైర్పర్సన్ దావ వసంతసురేష విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటానికి చేసిన వాగ్దానాలు ఆరు గ్యారంటీలు 420 హామీలు 1000 రోజులు గడుస్తున్న అమలు చేయడం లేదని ధ్వజమేత్తారు. గత ఎన్నికల్లో ప్రజలను ఆశల పల్లకిలో ఊరేగించి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. కేసీఆర్ అమలు చేసిన పథకాల సైతం అమలు చేయకపోవడం రేవంత్రెడ్డి వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధి నాయకత్వం పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ భూమిని పెట్రోల్ బంక్ పేరిట ఆక్రమించిన భూమిని కాపాడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేకు లేదా అని నిలదీశారు. ప్రభుత్వ భూములు కాపాడడం ఎమ్మెల్యే బాధ్యత కాదా అని ప్రశ్నించారు.

# మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడలను ప్రోత్సహించాలి



మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని శనివారం కామారెడ్డి జిల్లా దోమకొండ కోటలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దోమకొండ విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, మేజర్ ధ్యాన్‌చంద్ దేశానికి అందించిన క్రీడా సేవలు, ఆయన సాధించిన విజయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను, పట్టుదలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువత తమలోని క్రీడా ప్రతిభను వెలికితీసుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, యువతీ యువకులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో దోమకొండ ట్రస్ట్ ప్రతినిధి కామినేని అనిల్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, దోమకొండ కోట మేనేజర్ బాబ్జీ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణి లో జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు



స్థానిక లక్ష్మీదేవి పల్లిలో గల త్రివేణి పాఠశాల ప్రాంగణంలో హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన చంద్ వి జన్మదినని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం లో భాగంగా వారి చిత్ర పటానికి పూలమాలేశారు. భారతదేశం కి చెందిన గొప్ప హాకీ క్రీడాకారుడు. ఆయనను హాకీ మాంత్రికుడని ప్రపంచవ్యాప్తంగా గౌరవిస్తారు. ఆయన అద్భుతమైన ఆటతీరు. భారతదేశానికి హాకీలో ప్రపంచ ఖ్యాతి తీసుకొచ్చింది. త్రివేణి విద్య సంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ మాట్లాడుతూ ప్రతిభ ఒకటే విజయాన్ని ఇవ్వదు.నిరంతర సాదన, క్రమశిక్షణ, పట్టుదల, దేశం పట్ల ప్రేమ ఉంటేనే గొప్ప విజయం సాధించగలం. అందుకే మేజర్ ధ్యాన్ చంద్ భారత్ క్రీడ చరిత్రలో ఎప్పటికీ మరువలేని హాకీ మాంత్రికుడిగా నిలిచిపోయారు. ధ్యానచంద్ భారత్ హాకీ జట్టులో ఆటగాడిగా ఎదిగారు.1928,1932,1936, ఒలంపిక్ క్రీడల్లో భారతదేశానికి బంగారు పతకం సాధించడంలో ప్రధాన పాత్ర పోషించారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రివేణి పాఠశాల సిఆర్ ఓ కాట్రగడ్డ మురళి కృష్ణ, ప్రిన్సిపాల్ వి. సూర్యనారాయణమూర్తి, శ్రీనివాస్ సింగ్, నేతాజీ,వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పీఈటీలు పాల్గొన్నారు.

## తుమ్మిడిహట్టి బ్యారేజీ: మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న మంత్రి ఉత్తమ్

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం పొందడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో, ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీని నిర్మిస్తే, ఎలాంటి భారీ లిఫ్టుల అవసరం లేకుండానే సుమారు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను గ్రావిటీ ద్వారా సహజ సిద్ధంగా సుందిళ్ల బ్యారేజీకి తరలించవచ్చని మంత్రి వివరించారు.

# నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు



కామారెడ్డి జిల్లాలో నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.91 వేల నకిలీ కరెన్సీ, కారు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 26న పిట్లం పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌కు ఎం హెచ్-38-వి-2837 నంబర్ గల స్విఫ్ట్ డిజైర్ కారులో నలుగురు వ్యక్తులు వచ్చి రూ.2,000 విలువైన పెట్రోల్ కొట్టించుకుని, రూ.500 విలువైన నాలుగు నోట్లను అందజేశారు. అవి నకిలీ నోట్లు అని గుర్తించిన పెట్రోల్ బంక్ క్యాషియర్ శ్రీకాంత్ రెడ్డి వారిని ఆపేందుకు ప్రయత్నించగా, వారు ఆగకుండా కారులో పరారయ్యారు. ఈ ఘటనపై క్యాషియర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిట్లం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి పర్యవేక్షణలో బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య, పిట్లం ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. నకిలీ కరెన్సీని మరింతగా చలామణి చేసేందుకు హైదరాబాద్‌కు వెళ్తున్న నిందితులను ధర్మారం టోల్ ప్లాజా సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో నిందితులు హైదరాబాద్‌లో నకిలీ కరెన్సీని సేకరించి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు వెల్లడైంది.

# సమరభేరి కార్యక్రమాలను విజయవంతం చేయండి




బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీమంత్రి కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యిరోజుల విఫల పాలనకు నిరసనగా సెప్టెంబర్ 2వ తేదీనుంచి నిర్వహించనున్న సమరభేరి కార్యక్రమాలపై నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ శ్రేణులతో కలిసి ఇల్లందు మాజీ శాసనసభ్యురాలు బానోత్ హరిప్రియ నాయక్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యిరోజులు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజాసమస్యలను పట్టించుకోకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పోలిస్తే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బిఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2వ తేదీనుంచి నిర్వహించనున్న సమరభేరి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. పట్టణ మండలాలలో కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయుడు సూచించారు. ఈ సన్నాహక సమావేశంలో తెలంగాణ ఉద్యమ సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, జిల్లా నాయకులు ప్యాక్స్ చైర్మన్ లక్కినేని సురేందర్రావు, జిల్లా నాయకులు భూక్య దళ్సింగ్, లకావత్ దేవిలాల్ నాయక్, 13వ వార్డు కౌన్సిలర్, జననేత దండు సారయ్య, మాజీ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వరరావు, మాజి కోఆప్షన్ సభ్యులు మసూద్ రబ్బ, పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి గోదావరి పుష్కరాలకు 40 కోట్ల రూపాయలు



జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆలయ అభివృద్ధిలో భాగంగా అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు తీసుకొని అమలు చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉన్న ఉగ్ర నరసింహ స్వామి దేవాలయం పునర్ నిర్మాణంపై మంత్రి రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావుతో కలిస శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రజాభిప్రాయ సేకరణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా ఆలయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. గోదావరి పుష్కరాలకు ధర్మపురి నియోజకవర్గానికి ఇప్పటికీ ప్రభుత్వం రూ. 117 కోట్లు కేటాయించింది
మంత్రి తెలిపారు. 40 కోట్లు బైపాస్ రోడ్లు పుష్కర ఘాట్ల నిర్మాణానికి ప్రభుత్వం నుండి నిధులు విడుదల కానున్నయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ ధర్మపురి లోని ఉగ్ర



నరసింహ స్వామి ఆలయ పునర్ నిర్మాణం 10 కోట్లతో చేపడుతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా గంథ్రాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ జగిత్యాల అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) రాజ గౌడ్ జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ ధర్మపురి ఆలయ ఈవో శ్రీనివాస్ ధర్మపురి మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబుతో మారిషస్ మంత్రి భేటీ





మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ మంత్రి లుచ్‌మనన్ పెంతియా శనివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో పరిపాలన, టూరిజం, ఐటీ/ఐటీఈఎస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, నైపుణ్యాభివృద్ధి, విద్యా తదితర రంగాల్లో 'తెలంగాణ -- మారిపథంలో దూసుకు పోతున్న 'తెలంగాణ'ను తమ దేశం అత్యంత నమ్మకమైన భాగస్వామిగా పరిగణిస్తోందని ఈ సందర్భంగా మారిషస్ మంత్రి లుచ్‌మనన్ పెంతియా పేర్కొన్నారు. మారిషస్ ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు, ఆధునిక పరిపాలనా విధానాలపై వారికి శిక్షణ ఇచ్చేందుకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును కోరారు. అలాగే... రాష్ట్రంలోని ఎంసీహెచ్‌ఆర్డీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఇతర ప్రముఖ విద్యా సంస్థలతోనూ పనిచేసేందుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు. అన్ని రంగాల్లోనూ మారిషస్ కు సహాయ సహకారాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. అంతర్జాతీయ భాగస్వామ్యాలకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. డిసెంబర్ 7' 8 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026"లో పాల్గొనాలని మంత్రి లుచ్‌మనన్ పెంతియాను ఆహ్వానించారు.
సమావేశంలో సెక్రటరీ ఫర్ పబ్లిక్ సర్వీస్ దేవేంద్ర గోపాల్, అటల్ బిహారీ వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ సర్వీస్ అండ్ ఇన్నోవేషన్ (ఏఐపీఎస్ఐ) బోర్డ్ చైర్‌పర్సన్ డాక్టర్ నికోలస్ రాగోడూ , ఏఐపీఎస్ఐ రిజిస్ట్రార్ డా. రమేష్ దుర్బరీ, ఎంఈఏ బ్రాంచ్ సెక్రటేరియట్ హెడ్ మాధవ్ ఆర్. సుల్భులే, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఐటీఈఅండ్ సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయాల సేకరణ



రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా కడ్తాల్ సమీపంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అబ్జర్వర్‌గా కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి శ్రీ పి.వి. మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సమావేశంలో కల్వకుర్తి ఎమ్మెల్యే శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. అలాగే అబ్జర్వర్లుగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శ్రీ పటేల్ రమేష్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. శ్రీమతి మట్టా రాగమయి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీ ఈ.వి. శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.రంగారెడ్డి జిల్లా డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులతో అబ్జర్వర్లు సమావేశమై వారి అభిప్రాయాలు, సూచనలను స్వీకరించారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి, కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి పి.వి. మోహన్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలకు తలకొండపల్లి మండలానికి చెందిన జుట్టు తిరుపతి ముదిరాజ్ విజయ కంకణం కట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పురాతన హనుమాన్ ఆలయాలకు పూర్వ వైభవం



శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని పాపన్నపేట గ్రామంలో వెలిసిన ప్రతి ఒక్క పురాతన, నిరుపయోగంగా ఉన్న హనుమాన్ దేవాలయాలన్నింటికి సింధూర చందన కార్యక్రమాన్ని నిర్వహించాలని గ్రామం పూజారులు గ్రామ సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ గారు నిర్ణయిం చారు. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యా లతో ఉండాలని, గ్రామంలో పాడిపంటలు, పశువులు అభివృద్ధి చెందాలని, గత కొన్ని నీళ్లుగా నిరుపయోగంగా పాడుబడిన స్థితిలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాలన్నింటికీ ఈ సింధూర కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి శ్రావణ మాసంలో ఏ యొక్క పురాతన ఆలయాన్ని మర్చిపోకుండా ప్రతి ఆలయానికి సింధూర అలంకరణ చేసేలా పూజారులతో మాట్లాడి సర్పంచ్ గారు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామ దేవుళ్లను మర్చిపోతే గ్రామానికి అరిష్టం పాడుబడిన ప్రతి హనుమాన్ ఆలయానికి సింధూరం పూసి, దీపం వెలిగిస్తే ఆంజనేయస్వామి ఆశీస్సులతో మన గ్రామం సుభిక్షంగా ఉండాలని ఇది కేవలం పూజ మాత్రమే కాదు, మన సంస్కృతిని, మన పురాతన ఆలయాలను కాపాడుకునే బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు, రాజకీయ నాయకులు, యువకులు, ఆంజనేయ స్వామి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ




విద్యార్థులకు ప్రజాసేవా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కేకే-1 ప్రధానోపాధ్యాయురాలు రజిత,శ్రీలత సమక్షంలో నోట్ బుక్స్ పంపిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ అజీమోద్దీన్ మాట్లాడుతూ... విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో,మావంతు సహాయంగా ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం మందమర్రి కేకే-1 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తు, ఇలాంటి సేవా కార్యక్రమాలకు సహాయం చేయాలని ఆసక్తి ఉన్న దాతలు, సేవాభిమానులు ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీని సంప్రదించాలని కోరారు.వారి సహకారాన్ని అవసరమైన వారికి చేరేలా సద్వినియోగం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నందిపాటి రాజ్ కుమార్,కార్యదర్శి గాండ్ల సంజీవ్ పటేల్, ఎండి.జావిద్ పాషా, అన్వేష్,సూర్య,ఇమామ్ స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంగ్లీని కాపాడుతున్న ఆ కేంద్ర మంత్రి ఎవరు?: అడ్వకేట్ సుబ్బు

మైక్రో ఫైనాన్స్ కేసు వివాదంలో ప్రముఖ గాయని మంగ్లీ చుట్టూ ముసురుకున్న ఆరోపణల వ్యవహారం మరింత తీవ్రరూపం దాలుస్తోంది. మంగ్లీతో తాను రాజీ పడినట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను న్యాయవాది సుబ్బు ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేస్తూ... కేసు ఉపసంహరణ కోసం మంగ్లీ మనుషుల నుంచి రూ. కోట్లలో ఆఫర్ వచ్చిందని, కానీ తాను దానిని తిరస్కరించిన విషయం ప్రజలందరికీ తెలుసని అన్నారు.కోర్టుల్లో మంగ్లీపై తాను వేసిన పిటిషన్లతో పాటు, తనపై మంగ్లీ చేసిన నిరాధారమైన ఫిర్యాదుల కేసులు ఇప్పటికీ విచారణలోనే ఉన్నాయని సుబ్బు స్పష్టం చేశారు. తీవ్రమైన అక్రమ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి అమెరికాలోని ఎన్నారై తెలుగు నిర్వాహకులు అంతర్జాతీయ వేదికలపై ఎలా అవకాశాలు ఇస్తారని ప్రశ్నించారు. కేసులో నిజానిజాలు తేలేవరకు ఆమెకు విదేశీ షోలలో అవకాశాలు ఇవ్వకూడదని, ఈ విషయమై ఇప్పటికే ఫిల్మ్ ఛాంబర్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.బాధితుల పక్షాన నిలబడ్డ తమను ఊరు దాటవద్దని పోలీసులు ఆంక్షలు విధిస్తుంటే, నిందితురాలిగా ఉన్న మంగ్లీ స్వేచ్ఛగా విదేశాలకు ఎలా వెళ్తోందని నిలదీశారు. ఆమె అరెస్ట్ కాకుండా వెనుకుండి కాపాడుతున్న ఆ కేంద్ర మంత్రి ఎవరో ప్రజలే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా, ఈ కేసులో కీలక సాక్షి అయిన డ్రైవర్ ఏమయ్యాడు? అతడిని మంగ్లీతో లాలూచీ చేయించింది ఎవరు? అని సంచలన ప్రశ్నలు గుప్పించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేదే లేదని స్పష్టం చేశారు.



# ఏ క్షణంలోనైనా బద్దలవ్వొచ్చు..
# నేపాల్‌కు చైనా మరోసారి హెచ్చరిక




నేపాల్-టిబెట్ సరిహద్దులో హిమనీనదం కూలిపోవడంతో ఏర్పడిన కృత్రిమ సరస్సు (బ్యారియర్ లేక్) ఏ క్షణంలోనైనా బద్దలయ్యే ప్రమాదం ఉందని చైనా అధికారులు నేపాల్‌ను మరోసారి హెచ్చరించారు. ఈ సరస్సు గట్టు తెగితే భారీగా వరద నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే అవకాశం ఉందని అప్రమత్తం చేశారు. అయితే, తాజా అంచనాల ప్రకారం తక్షణ ముప్పు కాస్త తగ్గిందని, పరిస్థితి కొంత అదుపులోకి వచ్చిందని కూడా వారు వెల్లడించారు. బుధవారం అత్యంత ఎత్తులో ఉన్న ఒక హిమనీనదం విస్ఫోటనం చెందడంతో ఈ ప్రళయం సంభవించింది. ఈ దుర్ఘటనలో భారీగా రాళ్లు, మంచు, బురద కొట్టుకువచ్చి నదీ ప్రవాహానికి అడ్డుకట్ట వేయడంతో ఈ సహజ ఆనకట్ట ఏర్పడింది. దీనివల్ల గైరాంగ్ సరిహద్దు క్రాసింగ్, భోటే కోశి, త్రిశూలి నదీ వ్యవస్థల పరిధిలోని ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో నేపాల్ విదేశాంగ శాఖకు చైనా అధికారులు ఒక సందేశం పంపారు. సరస్సులోని నీటి రంగు క్రమంగా ముదురు రంగులోకి మారుతోందని, ఇది ఆనకట్ట ఏ క్షణంలోనైనా బద్దలవడానికి సంకేతం కావచ్చని పేర్కొన్నారు. శుక్రవారం నాటికి సరస్సులో సుమారు 2.5 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని అంచనా వేశారు. ఒకవేళ ఆనకట్ట పాక్షికంగా బద్దలైతే, సెకనుకు 500 క్యూబిక్ మీటర్ల వేగంతో ప్రవాహం ఉండవచ్చని, ఇది నది గట్లకే పరిమితం అవుతుందని తెలిపారు. అయితే, ఆ తర్వాత చైనా అధికారులు మరో తాజా సమాచారం అందించారు. సరస్సు ఉపరితల వైశాల్యం తగ్గిందని, దీంతో వరద ముప్పు కాస్త తగ్గిందని వారు స్పష్టం చేశారు. ఈ అంచనాతో తాత్కాలికంగా నిలిపివేసిన సహాయక చర్యలను పునఃప్రారంభించారు. అధికారులు డ్రోన్లు, శాటిలైట్ల సహాయంతో పరిస్థితిని నిరంతరం గమనిస్తున్నారు. దీనికి ఎగువన మరో పెద్ద నీటి వనరును కూడా గుర్తించి, దాని కదలికలను కూడా పర్యవేక్షిస్తున్నారు. ఈ విపత్తు కారణంగా సరిహద్దుకు ఇరువైపులా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వెయ్యి మందికి పైగా గల్లంతయ్యారు. మృతుల్లో చాలా మంది విదేశీయులు కూడా ఉన్నారు. ప్రతికూల వాతావరణం, మళ్లీ వరదలు రావచ్చన్న ఆందోళనల మధ్య సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి.

# మమతపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి..

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారి ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఆదేశాలను ధిక్కరించినందుకు ఈ చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను ఆదేశించ డం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. తృణ మూల్ కాంగ్రెస్ విద్యార్థి విభాగం (టీఎంసీపీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిన్న కోల్‌కతా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి కలకత్తా హైకోర్టు కొన్ని షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. అందులో ముఖ్యంగా రహదారిపై ఒక లేన్‌ను పూర్తిగా ట్రాఫిక్‌కు వదిలిపెట్టి, మరో లేన్‌లో మాత్రమే ర్యాలీ నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయితే, ఈ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించి ర్యాలీ నిర్వాహకులు రెండు లేన్లను దిగ్బంధించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఉల్లంఘనలపై ముఖ్యమంత్రి సువేందు అధికారి తీవ్రంగా స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ.. “కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన తీరు స్పష్టంగా కనిపించింది. రహదారిలో ఒక లేన్‌ను ఖాళీగా ఉంచాలని కోర్టు చెప్పినా, మాజీ ముఖ్యమంత్రి ప్రజలను సమీకరించి రెండు లేన్లనూ మూసివేశారు. ఈ విషయంలో తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించాను. దీనిపై కలకత్తా హైకోర్టును కూడా ఆశ్రయించాలని సూచించాను.

# ‘ప్యారడైజ్’ నుంచి ‘యేష నాగుల’ సాంగ్ వచ్చేసింది
# ఇది కదా మాస్ బీట్!



నేచురల్ స్టార్ నాని, ‘దసరా’ ఫేమ్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా ‘ది ప్యారడైజ్’. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్‌తో అంచనాలను పెంచేసిన ఈ చిత్రం నుంచి మరో సర్ప్రైజ్ వచ్చేసింది. ‘యేష నాగుల కట్ట మీద’ అంటూ సాగే రెండో పాటను చిత్రబృందం వినూత్నంగా విడుదల చేసి అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. తాజాగా యూట్యూబ్ లో ఈ పాటను విడుదల చేశారు. ఈ పాటను అమెరికాలోని డల్లాస్‌లో మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ నిర్వహిస్తున్న లైవ్ కాన్సర్ట్‌లో గ్రాండ్‌గా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి నాని ‘జడల్’ పాత్ర గెటప్‌లో (పొడవాటి జుట్టు, రెక్కల డిజైన్‌తో ఉన్న ప్రత్యేక జాకెట్‌తో) సర్ప్రైజ్ ఎంట్రీ ఇచ్చి అభిమానులను ఉర్రూతలూగించారు. వేదికపై అనిరుధ్‌తో కలిసి నాని వేసిన మాస్ స్టెప్పులకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఈ సందర్భంగా దిష్టి తగలకుండా సినిమాలోని ఓ డైలాగ్‌ను కూడా నాని ప్రేక్షకులతో చెప్పించి అలరించారు. ఇప్పుడు ఈ పాటను డిజిటల్ ప్లాట్ ఫామ్స్ లోనూ విడుదల చేశారు. తెలంగాణ జానపదానికి అనిరుధ్ తనదైన శైలిలో మాస్ బీట్స్ జోడించి స్వరపరిచిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, జంగి రెడ్డి, ప్రభ ఆలపించారు. ఈ పాటలో నాని, కీర్తి సురేశ్ కలిసి మాస్ స్టెప్పులతో అదరగొట్టారు. ‘దసరా’ తర్వాత నాని, కీర్తి, శ్రీకాంత్ ఓదెల కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. పాట విడుదల సందర్భంగా కీర్తి సురేశ్, నాని మధ్య సోషల్ మీడియాలో జరిగిన సరదా సంభాషణ కూడా వైరల్ అయింది. చిత్రంలో నాని తన భూమి, ప్రజల కోసం పోరాడే శక్తివంతమైన ‘జడల్’ పాత్రలో కనిపించనున్నారు. కయాదు లోహర్, మోహన్ బాబు, రాఘవ్ జుయల్, తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు వంటి భారీ తారాగణం నటిస్తున్న ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com